నేటి కందం- నేటికి అందం

పాకిస్థాను మనంబున
రేకెత్తించంగ భయము ప్రియతముడని చా
మీకర హృదయుని గొలుతును
భీకర ప్రకటన నిడిన యుపేంద్ర ద్వివేదిన్ !!

(ఉగ్రవాదానికి ఊతమిస్తే అంతు తేలుస్తామని మన సైన్యాధిపతి జనరల్ ఉపేంద్ర ద్వివేది పాకిస్థాను ను హెచ్చరించారు)



-రాధశ్రీ
సెల్:9494481210

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com  ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433  E-mail:netinijam93@gmail.com

ఎన్నికలయి పోయినై
ఎతలింకా మిగిలినై
బీహారులో వలసలెన్నో
బయటకెల్తూ కుమిలినై .
అధికారం ఎన్నో ఏళ్లు
అభివృద్ధి ఎవరి ఇంటా
అల్లాడే నిరుపేదలు
ఆగుపించరు వారి కంట

చురక



-వేల్పుల నారాయణ
9440433475

హైదరాబాద్ బుధవారం 19-11-2025 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 ▪ Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:82 పేజీలు:6 వెల: రూ.1/-


## మంటల్లో అంబులెన్స్..
# నవజాత శిశువు, వైద్యుడు సహా నలుగురు సజీవదహనం





న్యూఢిల్లీ, నవంబర్ 18:గుజరాత్ లో ఘోర ప్రమాదం సంభవించింది. అంబులెన్స్ లో మంటలు చెలరేగాయి. ఈ దుర్ఘటనలో నవజాత శిశువు, ఓ వైద్యుడు సహా మొత్తం నలుగురు ప్రాణాలు కోల్పోయారు. మంగళవారం తెల్లవారుజామున ఈ ఘటన చోటు చేసుకుంది.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుజరాత్‌లోని అర్వల్లి జిల్లాలో గల మోడసా పట్టణ సమీపంలో ఈ ఘటన చోటు చేసుకుంది. అప్పుడే పుట్టిన శిశువు అనారోగ్యంతో బాధపడుతుండటంతో చిన్నారిని మోడసాలోని ఆస్పత్రి నుంచి మెరుగైన వైద్యం కోసం అహ్మదాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి అంబులెన్స్‌లో తీసుకెళ్తున్నారు. ఈ క్రమంలో తెల్లవారుజామున 1 గంట ప్రాంతంలో మోడసా-ధన్సురా రహదారిపై అంబులెన్స్‌లో మంటలు చెలరేగాయి . ఆ సమయంలో అంబులెన్స్‌లో శిశువు తండ్రి జిగ్నేష్ మోచి (38), అహ్మదాబాద్‌కు చెందిన వైద్యుడు శాంతిలాల్ రెంటియా (30), నర్సు భూరిబెన్ మనత్ (23) ఉన్నారు. ఈ ప్రమాదంలో వారు సజీవదహనమైనట్లు పోలీసులు వెల్లడించారు.

అంబులెన్స్ డ్రైవర్, మరో ముగ్గురు ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడ్డారు. వారు కాలిన గాయాలతో ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# మహిళా స్వయం సహాయక బృందాలకు 600 బస్సులు




హైదరాబాద్, నవంబర్ 18:తెలంగాణలోని రేవంత్ రెడ్డి సర్కార్ గ్రామీణ మహిళల సాధికారత కోసం మరో అద్భుతమైన స్కీమ్ ప్రవేశపెట్టింది. సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ కింద, మహిళల స్వయం సహాయక బృందాలకు మొత్తం 600 బస్సులు అందించనుంది. ఈ కార్యక్రమం ద్వారా గ్రామీణ మహిళలు బస్సుల యజమానులుగా మారి, స్థిరమైన ఆదాయాన్ని సంపాదించే అవకాశం లభిస్తుంది. ఇది మహిళల ఆర్థిక స్వాతంత్ర్యాన్ని బలోపేతం చేస్తూ, గ్రామీణ పేదరిక నిర్మూలనకు కీలకంగా నిలవనుంది.

ఈ స్కీమ్ ప్రకారం, ఒక్కో బస్సు ధర సుమారు రూ.36 లక్షలు. మహిళా బృందాలు రూ.6 లక్షలు ఇన్వెస్ట్ చేస్తాయి. మిగిలిన మొత్తాన్ని కమ్యూనిటీ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ ద్వారా ప్రభుత్వం అందిస్తుంది. బస్సులు మహిళల యాజమాన్యంలో ఉంటాయి. కానీ, ఈ బస్సులను తెలంగాణ స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ నడిపిస్తుంది. ప్రతి బస్సుకు నెలకు రూ.69,648 చెల్లిస్తుంది. ఇందులో రూ.19, 648 ఆపరేషనల్ ఖర్చులకు, మిగిలినది లోన్ తిరిగి చెల్లింపు నకు వాడతారు.

ఇలా 7 సంవత్సరాలపాటు రిస్క్ లేకుండా స్థిర ఆదాయం లభిస్తుంది. కార్యక్రమం దశలవారీగా అమలవుతోంది. మొదటి దశలో 17 జిల్లాల్లో 151 మహిళా బృందాలు 151 బస్సులు పొందాయి. రెండో దశలో మిగిలిన 449 బస్సులు కొనుగోలు చేస్తారు. ఈ బస్సులు తెలంగాణలో అమలవుతున్న మహాలక్ష్మి స్కీమ్ కింద ఉచిత ప్రయాణాలకు సహాయపడతాయి. గ్రామీణ ప్రాంతాలకు మరిన్ని బస్సులు అందేలా చేస్తాయి. ఇది ఆర్టిసిని ప్రైవేట్ బస్సులపై ఆధారపడకుండా, మహిళల యాజమాన్య బస్సులపై ఆధారపడేలా మార్చుతుంది. ప్రభుత్వం ఈ కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా రూ.5 కోట్లు కేటాయించింది.

# తెలంగాణకు మరోసారి జాతీయ స్థాయిలో అవార్డుల పంట

హైదరాబాద్, నవంబర్ 18: జల్ సంచయ్ జన్ భాగీదారీ విభాగంలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం అగ్రస్థానంలో నిలిచింది. కేంద్ర జలశక్తి శాఖ ప్రకటించిన ఆరో జాతీయ జల అవార్డులు – 2024లో జాతీయ స్థాయిలో తెలంగాణ తొలి ర్యాంకును సాధించింది. కేంద్ర ప్రభుత్వం– 2024లో ప్రారంభించిన ఈ కార్యక్రమం కింద.. తెలంగాణ వ్యాప్తంగా మొత్తం 5,20,362 పనులని పూర్తిచేసింది.

జల్ సంచయ్ జన్ భాగీదారీ విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన రాష్ట్రాలకు భారతదేశ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఇవాళ (మంగళవారం) పురస్కారాలు ప్రదానం చేశారు. జల్ సంచయ్ జన్ భాగీదారీని ఉత్తమంగా అమలు చేసిన రాష్ట్రాలు, జిల్లాలు, స్థానిక సంస్థలకు కేంద్రప్రభుత్వం 100 అవార్డులను ప్రకటించింది. ఇందులో మూడు రాష్ట్రాలు, 67 జిల్లాలు, 6 మున్సిపల్ కార్పొరేషన్లు, ఒక పట్టణ స్థానిక సంస్థ, రెండు భాగస్వామ్య మంత్రిత్వ శాఖలు/విభాగాలు, రెండు పరిశ్రమలు, మూడు ఎన్‌జీఓలు, ఇద్దరు దాతలు, 14 మంది నోడల్ అధికారులు ఉన్నారు.

క్షేత్రస్థాయిలో జల సంరక్షణలో ప్రజలు, సంఘాలు, కార్పొరేట్ సంస్థలను భాగస్వాములను చేసే లక్ష్యంతో ప్రారంభించిన ఈ కార్యక్రమం కింద.. రాష్ట్రాలను ఐదు జోన్లుగా విభజించారు. ప్రతి ఒక్కరూ కనీసం 10 వేల కృత్రిమ రీఛార్జి, స్టోరేజ్ నిర్మాణాలు చేపట్టాలని లక్ష్యంగా నిర్దేశిం చారు. ఇందులో రూఫ్‌టాప్ వాన నీటి సంరక్షణ, చెరువులు, కుంటలు, బావుల పునరుద్ధరణ కార్యక్రమాలను చేర్చారు. మంచి పనితీరు కనబరిచిన రాష్ట్రాలు, జిల్లాలు, మున్సిపల్ కార్పొరేషన్లను మూడు కేటగిరీలుగా విభజించి అవార్డులు ప్రకటించారు.

మొదటి కేటగిరీలో ఎంపికైన వాటికి రూ.2 కోట్లు, రెండో కేటగిరీలో కోటి రూపాయలు, మూడో కేటగిరీలో రూ.25 లక్షల నగదు బహుమతి ప్రకటించారు. జిల్లాల విభాగంలో కేటగిరీ-1 కింద దక్షిణ జోన్ నుంచి మూడు జిల్లాలను ఎంపిక చేయగా.. ఆ మూడింటినీ తెలంగాణ రాష్ట్రం కైవసం చేసుకుంది. ఒక్కో జిల్లాకు రూ.2 కోట్ల చొప్పున మొత్తం రూ.6 కోట్ల నగదు బహుమతి అందజేసింది. ఆదిలాబాద్, నల్గొండ, మంచిర్యాల జిల్లాలు ఈ నగదు బహుమతిని సాధించాయి.

# మావోయిస్టు పార్టీకి మరో షాక్.. పోలీసులకు లొంగిపోయిన దేవ్‌జీ!



హైదరాబాద్ నవంబర్ 18 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );మావోయిస్టుల అగ్ర నేత హిడ్మా ఎన్‌కౌంటర్ తెలుగు రాష్ట్రాల్లో సంచలనంగా మారింది. హిడ్మా ఎన్‌కౌంటర్ తర్వాత ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు, కాకినాడ, అల్లూరి జిల్లాల్లో కూంబింగ్ ఆపరేషన్ నిర్వహిస్తూ పలువురిని అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలోనే మావోయిస్టు ఉద్యమంలో కీలక నేత తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ పోలీసుల ఎదుట లొంగిపోయారని ఊహాగానాలు వస్తున్నాయి. ఇటీవలే ఆయన ఏపీ పోలీసుల ఎదుట లొంగిపోయారని ప్రచారం జరుగుతోంది. కానీ దీనిపై పోలీసులు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు.

### 43 ఏండ్ల క్రితమే అజ్ఞాతంలోకి..

తిప్పిరి తిరుపతి విషయానికొస్తే ఉమ్మడి కరీంనగర్ జిల్లా కోరుట్ల ఆయన స్వస్థలం. తిప్పిరి తిరుపతి దాదాపు 43 ఏండ్ల క్రితం అజ్ఞాతంలోకి వెళ్లారు. దళిత కుటుంబంలో పుట్టిన ఆయన.. ఇంటర్ వరకు కోరుట్లలోనే చదివారు. 1978 ప్రాంతంలో రైతుకూలీ పోరాటాలు, విద్యార్థి సంఘాలు, రాడికల్ స్టూడెంట్ యూనియన్ పోరాటాల్లో పాల్గొని కూలీరేట్ల పెంపుదలలో భాగస్వాములయ్యారు. వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా పోరాటం చేశారు. రాడికల్ స్టూడెంట్ యూనియన్ కోరుట్ల శాఖలో కీలకంగా ఉన్న ఆయన 1982లో ఆర్‌ఎస్‌యూ విద్యార్థులపై సాగిన మారణహోమంపై ఒగ్గుకథ రూపంలో ప్రచారం చేశారు. ఆరెస్సెస్, ఏబీవీపీ తిరుపతిపై పలుమార్లు దాడులకు దిగాయి. అప్పట్నుంచే పీపుల్స్‌వార్ కార్యక్రమాల ప్రాధాన్యం వివరించడంతో ఆయనపై నిర్బంధం పెరిగిపోయింది. పలుకేసులతో జైలుకు సైతం వెళ్లారు.

### పీపుల్స్‌వార్ నిర్మాణంలో కీలకపాత్ర

గణపతి కార్యదర్శిగా పీపుల్స్‌వార్ పార్టీ తన ప్రస్తానాన్ని కొనసాగించిన క్రమంలో మల్లోజుల కోటేశ్వర్‌రావు, నల్లా ఆదిరెడ్డి, శీలం నరేశ్, పులి అంజన్న, ఎర్రంరెడ్డి సంతోష్‌రెడ్డి, నంబాల కేశవరావు, మాధవ్, తిప్పిరి తిరుపతి కీలక భూమిక పోషించారు. పీపుల్స్‌వార్‌లో దళ సభ్యుడిగా ప్రస్థానం మొదలుపెట్టిన తిరుపతి, పార్టీలో అంచలంచెలుగా ఎదిగారు. మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా కార్యదర్శిగా, ఛత్తీస్‌గఢ్ స్టేట్ కమిటీ మెంబర్‌గా, దళ కమాండర్‌గా, జోనల్ కమిటీ మెంబర్‌గా, స్టేట్ కమిటీ మెంబర్‌గా, ప్లాటూన్ కమాండర్‌గా పనిచేసినట్టు తెలుస్తున్నది. ప్రస్తుతం కేంద్ర మావోయిస్టు పార్టీ మిలటరీ కమిషన్ కార్యదర్శిగా పనిచేస్తున్నట్టు సమాచారం. 2010వ సంవత్సరంలో ఛత్తీస్‌గఢ్‌లోని దంతేవాడ జిల్లాలో 74 మంది జవాన్ల మృతికి కారణమైన ఘటనలో తిప్పిరి తిరుపతి కీలక పాత్ర పోషించారు. పీపుల్స్‌వార్, మరికొన్ని విప్లవ గ్రూపులు కలిసి 2004లో మావోయిస్టు పార్టీగా అవతరించాయి. పీపుల్స్‌వార్ కేంద్ర కమిటీ కార్యదర్శిగా పనిచేస్తున్న గణపతి అలియాస్ ముప్పాల లక్ష్మణ్‌రావును మావోయిస్టు కేంద్ర కమిటీ తొలి కార్యదర్శిగా ఎన్నికయ్యారు. వృద్ధాప్యం నేపథ్యంలో గణపతి స్థానంలో నంబాల కేశవరావు కేంద్ర కమిటీ కార్యదర్శిగా నియమితులయ్యారు. ఆయన ఈ ఏడాది మేలో ఎదురుకాల్పుల్లో చనిపోయిన నేపథ్యంలో మావోయిస్టు కేంద్ర కమిటీ కొత్త కార్యదర్శిగా మావోయిస్టు పార్టీ మిలటరీ కమిషన్ కార్యదర్శిగా పనిచేస్తున్న తిప్పిరి తిరుపతిని నియమించినట్టు ప్రకటించింది. మావోయిస్టుల కదలికలతో ఏపీలో హై అలర్ట్ కొనసాగుతోంది. అడవిలో నుంచి ఏపీకి వచ్చిన మావోయిస్టుల కోసం భద్రతాబలగాల గాలింపు చర్యలు చేపట్టాయి. ఇప్పటికే విజయవాడ పరిసర ప్రాంతాల్లో 31 మంది మావోయిస్టులను అరెస్టు చేసిన పోలీసులు.. ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు, కాకినాడ, అల్లూరి జిల్లాల్లో సెర్చింగ్ ఆపరేషన్ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలోనే కాకినాడ జిల్లా కొవ్వవరంలో ఇద్దరు మావోయిస్టులను అరెస్టుచేశారు. అలాగే ఏలూరులో 15 మంది మావోయిస్టులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. వీరిలో చాలావరకు దేవ్‌జీ అనుచరులు ఉన్నట్లుగా తెలుస్తోంది.

# కూలిన కల్వర్టు.. నెల్లూరు-రాజంపేట రాకపోకలు బంద్



నెల్లూరు నవంబర్ 18 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );నెల్లూరు జిల్లా పొదలకూరు మండలం దేగలపూడి వద్ద కల్వర్టు కూలిపో యింది. మొంథా తుపాను నేపథ్యంలో కురిసిన భారీ వర్షాలకు ఈ కల్వర్టు కూలిపోయింది. అది కాస్త ఇవాళ కూలిపోయింది. దీంతో నెల్లూరు - రాజంపేట మధ్య రాకపోకలు నిలిచిపో యాయి. నెల్లూరు, రాజంపేట మధ్య వాహనాల రాకపోకలు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారుల నిర్లక్ష్యంతోనే కల్వర్టు కూలిపోయిందని ఆరోపిస్తున్నారు. అధికారులు తక్షణమే స్పందించి మరమ్మతులు చేపట్టి ఈ పరిస్థితి వచ్చేది కాదని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. మొంథా తుపాను ప్రభావంతో నెల్లూరు జిల్లాలో 450 కిలోమీటర్ల మేర రహదారులు దెబ్బతిన్నాయని జిల్లా అధికారులు గతంలోనే అంచనావేశారు. పొదలకూరు, రాపూర్ మధ్య ఉన్న ఎస్సీ కాలనీ సమీపంలోని కల్వర్టు లోపలకు కుంగిపోయిందని కూడా గుర్తించారు. దీనికి తాత్కాలికంగా పైపుల ద్వారా యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయించాలని నిర్ణయించారు. కానీ అందుకు అనుగుణంగా చర్యలు మాత్రం తీసుకోలేదు. దీంతో మరింత దెబ్బతిన్న కల్వర్టు తాజాగా కూలిపోయింది. ఈ కల్వర్టుతో పాటు కావలి, కొండాపురం, బ్రాహ్మణక్రాక, అనంతవరం, గండవరం, రాళ్లపాడు, కలిగిరి, ఓబులాపాలెం ప్రాంతాల పరిధిలో రహదారులు దెబ్బతిని ప్రయాణం కష్టంగా మారింది. చాలా కల్వర్టులు దెబ్బతినడంతో వాటి మరమ్మతులకు రూ.19 కోట్ల వరకు అవసరమవుతాయని కూడా తేల్చారు. కానీ మరమ్మతులు మాత్రం చేపట్టలేదు.

# అల్లూరి జిల్లాలో భారీ ఎన్‌కౌంటర్.. మావోయిస్టు అగ్రనేత హిడ్మా సహా ఆరుగురు మృతి





అమరావతి నవంబర్ 18 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి జిల్లా మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో మావోయిస్టులు, పోలీసులకు మధ్య ఎదురు కాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో ఆరుగురు మావోయిస్టులు మృతిచెందారు. ఏపీ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా సరిహద్దుల్లో మావోయిస్టుల కదలికలపై భద్రతా బలగాలకు సమాచారం అందింది. దీంతో మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో స్థానిక పోలీసులతో కలిసి కూబింగ్ చేపట్టారు. ఈ క్రమంలో ఇరుపక్షాలు తారసపడంతో పరస్పరం కాల్పులు జరుపుకొన్నారు. భద్రతా దళాల కాల్పుల్లో ఆరుగురు మావోయిస్టులు మరణించారు. ఆ ప్రాంతంలో ఇంకా కూంబింగ్ కొనసాగుతున్నదని అధికారులు వెల్లడించారు. మృతుల్లో మావోయిస్టు అగ్రనేత హిడ్మా, అతని సతీమణి హేమ ఉన్నారు. మరో అగ్రనేత ఆజాద్ కూడా మృతిచెందినట్లు తెలుస్తున్నది. మంగళవారం ఉదయం 6 గంటల నుంచి 7 గంటల సమయంలో పోలీసులు, మావోయిస్టుల మధ్య ఎదురు కాల్పులు జరిగాయని ఏపీ డీజీపీ హరీష్ కుమార్ గుప్తా తెలిపారు. ఈ ఎన్‌కౌంటర్‌లో ఆరుగురు మావోయిస్టులు మృతి చెందారని, వారిలో మావోయిస్టు అగ్రనేత హిడ్మా ఉన్నారని స్పష్టం చేశారు. హిడ్మాపై రూ.కోటికిపైగా రివార్డు ఉండగా, ఆయన భార్య హేమపై రూ.50 లక్షలకుపైగా నగదు బహుమతి ఉన్నది.

హిడ్మా అలియాస్ సంతోశ్..

ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా పూవర్తి గ్రామంలో హిడ్మా జన్మించారు. ఆయన అలసు పేరు మాద్వి హిడ్మా అలియాస్ సంతోశ్. 25 ఏండ్ల క్రితం అజ్ఞాతంలోకి వెళ్లారు. బస్తర్, దంతేవాడ ప్రాంత దళంలో కీలక సభ్యుడిగా ఎదిగారు. చిన్న వయస్సులోనే మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడిగా అయ్యారు. గెరిల్లా దాడులకు వ్యూహకర్తగా పేరొందిన హిడ్మా.. పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ (ఖఒఉం) ప్లాటూన్-1 కమాండర్‌గా పనిచేశారు. దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడిగానూ చేశారు. ఆయన మల్లా, నిషాద్ వర్గాలకు చెందిన వందలాది మందిని మావోయిస్టు పార్టీలో చేర్పించారు. వారికి సాయుధ శిక్షణ ఇచ్చి పీఎల్‌జీఏలో చేర్చి.. అభేద్యమైన సైన్యంగా తీర్చిదిద్దారు. గతంలో హిడ్మా నాయకత్వంలోనే భద్రతా బలగాలపై అనేక దాడులు జరిగాయని పోలీసు వర్గాలు పేర్కొన్నాయి. మోస్ట్ వాంటెడ్ జాబితాలో ఉన్న హిడ్మా.. చాలా సార్లు పోలీసులకు దొరికినట్టే దొరికి తప్పించుకున్నారు. అగ్రనేతలు సోనూ, ఆశన్నతోపాటు వందల మంది మావోయిస్టులు లొంగిపోయిన తర్వాత హిడ్మా లొంగుబాటు విషయంలో పెద్ద చర్చ జరుగుతున్నది. అనారోగ్య కారణాలతో ఆయన లొంగిపోనున్నట్లు వార్తలు కూడా వచ్చాయి. ఆయన కుమార్తె వంజెం కేషా అలియాస్ జిన్నీ ఈ ఏడాది ఫిబ్రవరిలో వరంగల్ పోలీసుల ఎదుట లొంగిపోయారు.

# మావోయిస్టులు ఏపీ నుంచి కార్యకలాపాలను తిరిగి ప్రారంభించాలని చూశారు

### -ఏపీ ఇంటెలిజెన్స్ చీఫ్ మహేశ్ చంద్ర కీలక ప్రకటన

అమరావతి నవంబర్ 18 (ఎక్స్ ప్రెస్ న్యూస్);అల్లూరి జిల్లాలో మంగళవారం ఉదయం జరిగిన ఎన్‌కౌంటర్‌పై ఏపీ ఇంటెలిజెన్స్ చీఫ్ మహేశ్ చంద్ర కీలక ప్రకటన చేశారు. ఈ కాల్పుల్లో మావోయిస్టు అగ్ర నేత హిడ్మా, అతని సతీమణి మృతిచెం దినట్లుగా నిర్ధారించారు.

ఛత్తీస్‌గఢ్‌లోని పరిణామాలతో మావోయిస్టులు ఏపీకి రావాలని చూస్తున్నారని మహేశ్ చంద్ర తెలిపారు. మావోయిస్టు కార్యకలాపాలపై నిఘా ఉంచామని పేర్కొన్నారు. మావోయిస్టుల కదలికలపై ఇంటెలిజెన్స్ నుంచి రెండు రోజుల క్రితం పక్కా సమాచారం వచ్చిందని చెప్పారు. మావోయిస్టులు ఏపీ నుంచి కార్యకలాపాలను తిరిగి ప్రారంభించాలని చూశారని వెల్లడించారు. ఈ క్రమంలోనే మంగళవారం ఉదయం 6.30-7.00 గంటల మధ్య భద్రతాబలగాలు, మావోయిస్టుల మధ్య ఎదురుకాల్పులు జరిగాయని తెలిపారు. ఈ ఎన్‌కౌంటర్‌లో అగ్రనేత హిడ్మా, ఆయన సతీమణి సహా ఆరుగురు మావోయిస్టులు మరణించారని పేర్కొన్నా రు. అలాగే ఏపీలోని ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు, కాకినాడ జిల్లాల్లో 31 మంది మావోయిస్టులను అరెస్టు చేశామని మహేశ్ చంద్ర తెలిపారు. అరెస్టయిన వారిలో 9 మంది మావోయిస్టులు కేంద్ర కమిటీ సభ్యుడు దేవ్‌జీ అనుచరులుగా గుర్తించామని వెల్లడించారు.

# పోలీస్ స్టేషన్ గోడ దూకి పారిపోయిన ఎస్ఐ.. మెదక్ జిల్లాలో సంచలన ఘటన

మెదక్, నవంబర్ 18:మెదక్ జిల్లా టేక్మాల్ పోలీస్ స్టేషన్లో ఒక వింతైన ఘటన చోటుచేసుకుంది. సాక్షాత్తూ పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ తన పోలీస్ స్టేషన్ గోడ దూకి పారిపోయాడు. ఒక కేసుకు సంబంధించి రూ.20వేలు లంచం తీసుకుంటూ ఎస్ఐ రాజేశ్.. ఏసీబీకి పోలీస్ స్టేషన్లో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. దీంతో అతడ్ని అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్న సమయంలో అక్కడి నుంచి పరుగు లంకించుకున్నాడు.

ఏసీబీ అధికారుల నుంచి తప్పించుకుని పారిపోయాడు రాజేశ్.

దీంతో ఎస్ఐ రాజేశ్ ని వెంబడించి, చివరికి ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. అయితే, ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఎస్సై రాజేశ్.. ఏసీబీకి చిక్కడంతో స్థానికులు సంబరాలు చేసుకున్నారు. పోలీస్ స్టేషన్‌కు పెద్ద సంఖ్యలో చేరుకున్న స్థానికులు.. పోలీస్ స్టేషన్ ముందు టపాసులు కాల్చారు.

# లింగ సమానత్వ సాధనలో పురుషుల పాత్ర !

## (19 నవంబర్ "అంతర్జాతీయ పురుషుల దినోత్సవం" సందర్భంగా)

పురుషాధిక్య సమాజంలో మనం ఉన్నాం. పురుషుల నాయకత్వంలో స్త్రీలోకం వంటింటికుందేలుగానే ఇంటికి మాత్రమే పరిమితం అవుతున్నది. అన్ని రంగాల్లో పురుషులు మాత్రమే అత్యధిక సంఖ్యలో ముందంజలో ఉంటున్నారు. వార్డు మెంబర్ నుంచి దేశ ప్రధానులు, అధ్యక్షుల వరకు పురుషులే ఉంటున్నారు. ఉద్యోగాలు, ఉపాధుల్లో కూడా పురుషులదే సింహభాగం ఉంటున్నది. పురుషులే కుటుంబం నుంచి పౌర సమాజం వరకు అంతటా మగ మహారాజులే కనిపిస్తున్నారు. సమాజం ఎదుర్కొంటున్న లింగ అసమానతలు, మహిళకు స్వేచ్ఛ ఇవ్వకపోవడం లాంటి కొన్ని సమస్యలకు ప్రధాన కారణం పురుష సమాజమే అవుతున్నప్పుడు వారి కోసం ఒక దినోత్సవం జరపడం సోచనీయమంటూ వాపోతున్న వారు కూడా ఉన్నారు. ఈ విచిత్ర పరిస్థితుల్లో పురుషులకంటూ ఒక దినోత్సవం కేటాయించడం కొంత ఆశ్చర్యకరంగా ఉన్నది. ప్రకృతిలో సగమైన, మన జన్మలకు కారణమైన మహిళాలోకం అసమానతల విషవలయంలో చిక్కి కొట్టుమిట్టాడుతున్న వేళ అంతర్జాతీయ పురుషుల దినం పాటించడం అసమంజసంగా ఉందని అభిప్రాయపడేవారు ఉన్నారు. ఏది ఏమయినా నవంబర్ 19న ప్రతి ఏట ప్రపంచ దేశాలు "అంతర్జాతీయ పురుషుల దినోత్సవం లేదా ఇంటర్నేషనల్ మెన్ డే" పాటించడం 1999 నుంచి ఆనవాయితీగా మారింది.

### అంతర్జాత పురుషుల దినం-2025 థీమ్:

అంతర్జాతీయ పురుషుల దినం వేదికగా ప్రపంచ పురుష/బాలుర సమాజం ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించడం, సమాజాభివృద్ధిలో వారి పాత్రను కొనియాడడం, వారు కుటుంబ/సమాజ/వృత్తి సంబంధ బాధ్యతలను భుజాన ఎత్తుకున్న ఎదుర్కొంటున్న కష్టనష్టాలను గుర్తు చేసుకోవడం, పలు రంగాల్లో రాణించిన పురుషులను అభినందించడం, పురుషుల ఆరోగ్య సమస్యలు, మానసిక రుగ్మతలు, అసమానతలను/వివక్షలను రూపుమాపడం, సానుకూల మేల్ రోల్ మాడల్స్‌ను సన్మానించడం, లింగ-ఆధార హింసలు లాంటి అంశాలను వివరించడం జరుగుతున్నది. ఒక తండ్రి, భర్త, ఉద్యోగి, అన్న, గురువు, మెంటర్, సైనికుడు, పైలెట్, వ్యాపారి, వినియోగదారుడు, శ్రామికుడు లాంటి అనేక పాత్రల్లో పురుష సమాజం నాయకత్వం వహించడం చూస్తున్నాం. అంతర్జాతీయ పురుష దినోత్సవం-2025 థీమ్‌గా "సెలబ్రేటింగ్ మెన్ అండ్ బాయ్స్" అనబడే అంశాన్ని తీసుకున్నారు.

### 6-పిల్లర్స్ ఆఫ్ ఇంటర్నేషనల్ మెన్ డే:

అంతర్జాత పురుష దినం వేదికగా ఆరు ప్రధాన అంశాలను తీసుకొని చర్చించడం జరుగుతున్నది. పురుష ఆదర్శ మూర్తులను ప్రోత్సహించడం, సమాజాభివృద్ధిలో పురుషుల పాత్రను గుర్తించడం, పురుషుల ఆరోగ్యం/శ్రేయస్సుపై దృష్టి పెట్టడం, పురుషుల/బాలుర పట్ల వివక్ష లేదా అసమానతలను రూపుమాపడం, లింగ సమానత్వాన్ని సాధించడం, ప్రపంచం ఒక సురక్షిత ప్రదేశంగా మార్చడం అనబడే ఆరు మూల స్తంభాలను ఈ వేదికగా తీసుకోవడం జరుగుతోంది. ఈ రోజున పురుషులు, మగతనం, పురుషత్వం లాంటి అంశాల గూర్చి సానుకూల సంభాషణలు ప్రచారం చేయడంతో పాటు మనకు ఇష్టమైన నాన్న, భర్త లేదా సోదరుడికి శుభాకాంక్షలు తెలియజేయడం ఆనవాయితీగా వస్తున్నది. అంతర్జాతీయ పురుష దినం రోజున సామాజిక మాధ్యమాల్లో చమెన్స్‌హెల్త్, చజెండర్‌ఈక్వాలిటీ, చమేల్‌రోల్‌మాడెల్స్, చమెంటల్‌హెల్త్ లాంటి హాష్‌ట్యాగ్‌లను వాడుతూ ప్రచారం నిర్వహించవచ్చు.

1999లో ట్రినిడాడ్‌కు చెందిన జెరోమ్ తీలుక్‌సింగ్ ప్రారంభించిన ఒక చిన్న కార్యక్రమం నేడు ప్రపంచ దేశాలు పాటించే స్థాయికి చేరడం హర్షదాయకం, అభినందనీయం. కొన్ని ప్రత్యేక సందర్భాల్లో పురుషులు కుటుంబ పెద్దలుగా అనేక బాధ్యతను మోస్తూ, కష్టనష్టాలను భరిస్తూ, మానసికంగా కుంగిపోతూ, చివరకు ఆత్మహత్యలకు సహితం పూనుకోవడం చూస్తున్నాం. ఇలాంటి సంసార, ఉద్యోగ, ఉపాధి, వ్యాపార, వృత్తి, పిల్లల భవిష్యత్తుకు బాటలు వేయడం లాంటి అనేక బాధ్యతను తన భుజాన వేసుకొని శ్రమిస్తున్న మగ మహారాజులను అభినందిస్తూ, కృతజ్ఞతలు తెలియజేద్దాం.

-డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# రామోజీరావు దార్శనికత్వం కలిగిన జాతి నిర్మాత: ఉపరాష్ట్రపతి

న్యూఢిల్లీ, నవంబర్ 18: తెలంగాణలోని హైదరాబాద్‌లో ఉన్న రామోజీ ఫిలిం సిటిలో నిర్వహించిన రామోజీ ఎక్సలెన్స్ పురస్కారాలు 2025 ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉపరాష్ట్రపతి శ్రీ సీపీ రాధాకృష్ణన్ హాజరయ్యారు.

ఏడు విభాగాల్లో రామోజీ ఎక్సలెన్స్ పురస్కారాలను అందించారు: గ్రామీణాభివృద్ధిలో శ్రీమతి అమలా అశోక్ రూయా, యూత్ ఐకాన్‌గా శ్రీ శ్రీకాంత్ బొల్లా, సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగంలో ప్రొఫెసర్ మాధవీ లత గాలి, సామాజిక సేవలో శ్రీ ఆకాశ్ టాండన్, కళలు-సంస్కృతిలో ప్రొఫెసర్ సాతుపాటి ప్రసన్న శ్రీ, పాత్రికేయంలో శ్రీ జయదీప్ హార్దికర్, మహిళా సాధికారతలో శ్రీమతి పల్లవీ ఘోష్ అవార్డులు స్వీకరించారు.

రామోజీ గ్రూపు ఫౌండేషన్ డే, శ్రీ రామోజీ రావు జయంతి సందర్భంగా ప్రదానం చేస్తున్న రామోజీ ఎక్సలెన్స్ పురస్కారాల ప్రారంభ కార్యక్రమంలో పాల్గొనడం తనకు దక్కిన గౌరవంగా, అదృష్టంగా భావిస్తున్నానని ఉపరాష్ట్రపతి శ్రీ సీపీ రాధాకృష్ణన్ తెలియజేశారు.

ఆలోచనలను సంస్థలుగా, ఆకాంక్షలను వాస్తవాలుగా మలచిన దార్శనికుడు శ్రీ రామోజీ రావు అని ఆయన కొనియాడారు. పాత్రికేయం, సమాచార రంగంలో మార్గదర్శిగా మాత్రమే కాకుండా.. సమాచారం, సృజనాత్మకత, వ్యాపార శక్తిని విశ్వసించిన జాతి నిర్మాత అని అన్నారు.

ఈనాడు నుంచి రామోజీ ఫిలిం సిటీ వరకు, ఈటీవీ సంస్థల నుంచి ఇతర సంస్థల వరకు శ్రీ రామోజీ రావు భారత పాత్రికేయ, వినోద, వ్యాపార రంగాల్లో విప్లవాత్మక కృషి చేశారని ప్రశంసించారు.

సత్యం, విలువలు, నైపుణ్యాల విషయంలో ఆయన కనబరిచిన అచంచలమైన నిబద్ధత దేశవ్యాప్తంగా తరతరాలకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు.

ఉత్తమ పనితీరును కనబరిచే, ఇతరులకు స్ఫూర్తి కలిగించే, సమాజంలో సానుకూల మార్పును తీసుకు రాగలిగే వ్యక్తులనూ, సంస్థలనూ గౌరవిస్తూ రామోజీ ఎక్సలెన్స్ పురస్కారాల ప్రదానం చేయడం.. ఆయన అందించిన విశిష్ట వారసత్వానికి గొప్ప నివాళి అని ఆయన అన్నారు.

ప్రజాస్వామ్యానికి నాలుగో మూల స్తంభంగా పిలిచే పాత్రికేయ రంగం ప్రజలకు సమాచారాన్ని అందించడంలో క్రియాశీలక పాత్ర పోషిస్తుందని వివరించారు.

అవసరానికి మించిన, నకిలీ సమాచార వ్యాప్తి ఎక్కువగా ఉన్న ఈ తరుణంలో విశ్వసనీయమైన, నైతికమైన, బాధ్యతా యుతమైన పాత్రికేయానికి ఉన్న ప్రాధాన్యాన్ని ఉపరాష్ట్రపతి వివరించారు.

ప్రధానమంత్రి నిర్దేశించిన వికసిత్ భారత్ 2047 లక్ష్యం దిశగా భారత్ ముందుకు సాగుతున్న నేపథ్యంలో ఆవిష్కరణలు, అంకుర సంస్థలు, మహిళా సాధికారత, గ్రామీణాభివృద్ధికి సంబంధించిన కథనాలను అందిస్తూ.. దేశ నిర్మాణంలో పాత్రికేయ సంస్థలు భాగం కావాలన్నారు. సత్యం, నిష్పాక్షిక ధోరణి, న్యాయం మీడియా సంస్థలకు ప్రధానాధారాలుగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు.

భారత్‌ను డ్రగ్స్ రహిత దేశంగా మార్చడంలో పత్రికలు ప్రధాన పాత్ర పోషించాలని, ఏఐ వేగంగా విస్తరిస్తున్న ఈ సమయంలో వాస్తవమైన, తప్పుదారి పట్టించే వార్తల మధ్య తేడాను గుర్తించడంలో ప్రజలకు సహాయం చేయాలని స్పష్టం చేశారు.

ఈ పురస్కారాలను అందిస్తున్న రామోజీ గ్రూపును ప్రశంసిస్తూ.. ఇవి జ్ఞాపకాన్ని స్ఫూర్తిగా, వారసత్వాన్ని సదుద్దేశంతో కూడిన చర్యగా మార్చాయని ఉపరాష్ట్రపతి అన్నారు.

పురస్కార గ్రహీతలందరినీ అభినందిస్తూ.. వారిని ఉత్తమ పనితీరుకు మార్గదర్శకులుగా వర్ణించారు. వారి విజయాలు ఎంతో మందికి స్ఫూర్తినిస్తాయనే విశ్వాసం వ్యక్తం చేశారు.

అసాధారణ విజయాలు సాధించిన వారిని సత్కరించడం మాత్రమే కాకుండా.. సామర్థ్యాన్ని నిజాయతీగా, సదుద్దేశంతో వినియోగించినప్పుడు.. అది దేశానికీ, మానవాళికీ మేలు చేస్తుందనే నిత్య సత్యాన్ని ఈ సాయంత్రం తెలియజేస్తుందంటూ తన ప్రసంగాన్ని ముగించారు.

తెలంగాణ గవర్నర్ శ్రీ జిష్ణు దేవ్ వర్మ, మాజీ ఉపరాష్ట్రపతి శ్రీ ఎం. వెంకయ్య నాయుడు, తెలంగాణ ముఖ్యమంత్రి శ్రీ ఎ.రేవంత్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ ఎన్ చంద్రబాబు నాయుడు, కేంద్ర బొగ్గు, గనుల మంత్రి శ్రీ జి.కిషన్ రెడ్డి, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి శ్రీ కింజరాపు రామ్మోహన్ నాయుడు, మాజీ ప్రధాన న్యాయమూర్తి శ్రీ ఎన్వీ రమణ, రామోజీ గ్రూపు చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ సీహెచ్ కిరణ్, సినీ రంగానికి చెందిన ప్రముఖులు, విశిష్ట అతిథులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# గర్భిణీ స్త్రీలకు అమ్మ ఒడి

అమరావతి, నవంబర్ 18:ఈరోజు నందిపేట్ పీహెచ్‌సీ ఆరోగ్య సెంటర్‌లో గర్భిణీస్త్రీలకు అమ్మఒడి కార్యక్రమంలోభాగంగా 56మంది గర్భిణీ స్త్రీలకు ఆరోగ్య చెకప్, రక్త పరీక్షలు చేసి ఆరోగ్య విద్యను గర్భిణీ స్త్రీ తీసుకోవలసిన పోషకాహారం జాగ్రత్తలు, గవర్నమెంట్ డెలివరీ మెడిటేషన్, నార్మల్ డెలివరీ లాభాల గురించి అవగాహన కల్పించారు.

పౌష్టికహారం తీసుకోవాలని ప్రతి నెలా తీసుకోవలసిన జాగ్రత్తలు, ప్రతి దినం చిన్నచిన్న వ్యాయామాల గురించి తెలియజేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రవీణ్ డాక్టర్ స్వాతి పీహెచ్‌సీ పద్మావతి, హేమలత, పీహెచ్‌సీ స్టాఫ్ వివిధ గ్రామాల ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

# మీడియా రంగంలో సేవలు అందిస్తున్న వివిధ పత్రికల, ఎలక్ట్రానిక్ మీడి యా మిత్రులకు సన్మానం

హైదరాబాద్, నవంబర్ 18:జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా రామన్నపేటలోనీ డాక్టర్ రాజేంద్రప్రసాద్ భారతి చారిట బుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మీడియా రంగంలో సేవలు అందిస్తున్న వివిధ పత్రికల, ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులను ఈ రోజు సంస్థ మేనేజింగ్ ట్రస్టి డాక్టర్ ఆడపు రాజేంద్రప్రసాద్ ఘనంగా సన్మానించారు.

ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. అనునిత్యం ప్రజా సమస్యలపై పోరాడుతూ ప్రభుత్వాలకు ప్రజలకు మధ్య వారధిగా సమస్యలు వెలికి తీసి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న మీడియా మిత్రులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రయోజనాలు జీతభత్యాలు ఉన్నా లేకున్నా మా ట్లాడలేని వారి గొంతుకై సమస్యలు స్వచ్ఛందంగా సమాజానికి అంద జేస్తున్నారని అన్నారు. సమాజానికి అనునిత్యం సేవలందిస్తున్న విలేక రులను గుర్తుంచుకొని సత్కరిం చడం అభినందనియమని అన్నారు.

సమాజ శ్రేయస్సు కోసం జర్నలిజం నిరంతర సేవలు అందిస్తుందని ఈ సందర్భంగా జర్నలిస్టులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జక్కుల విజయ కుమార్ బొట్ల స్వామిదాస్, డాక్టర్ పాలడుగుల సురేందర్, బావండ్ల పెల్లి కిరణ్ కుమార్, ఆరే రమేష్ , బత్తుల సత్యం తదితరులు పాల్గొన్నారు.

# వేసవికి ముందస్తు చర్యలు

## -జిల్లా కలెక్టర్ డా॥ సిరి..

కర్నూలు, నవంబర్ 18: వేసవి కాలంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందుగానే సమగ్ర ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలని సంబంధిత పనులను నవంబర్ నెలాఖరుకల్లా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. గ్రామ ప్రజలకు తాగునీటి కొరత రాకుండా ప్రత్యేక కార్యాచరణ



అధికారులను జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి ఆదేశించారు. ఆదోని మండలం 104 బసాపురం గ్రామంలోని సమ్మర్ స్టోరేజ్ (ఎస్.ఎస్.) ట్యాంక్‌లో జరుగుతున్న మరమ్మతులు మరియు నీటి నిల్వ సామర్థ్యాన్ని మంగళవారం కలెక్టర్ పరిశీలించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్.ఎస్. ట్యాంక్‌కు సంబంధించిన అన్ని మరమ్మతు అలాగే డిసెంబర్ చివరి నాటికి ట్యాంక్ పూర్తి సామర్థ్యంతో నీటిని నిల్వ చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం బసాపురం ఎస్.ఎస్. ట్యాంక్ 3,110 మిలియన్ లీటర్ల నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యం కలిగి ఉన్నప్పటికీ, ప్రస్తుతం కేవలం 20 శాతం మాత్రమే నీరు ఉన్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. రాబోయే వేసవిలో ప్రణాళికతో ముందస్తు చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ దిశానిర్దేశం చేశారు.

ఈ కార్యక్రమంలో ఇంచార్జి సబ్ కలెక్టర్ అజయ్ కుమార్, తహసీల్దార్ రమేష్, మున్సిపల్ కమిషనర్ కమిషనర్ నాసిర్ ఉసేన్, మున్సిపల్ డిప్యూటీ ఇంజినీర్లు వెంకట చలపతి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# మానవ సహిత అంతరిక్ష నౌక ప్రయోగానికి భారత్ సంసిద్ధత బలోపేతం లక్ష్యంగా

## బెంగళూరులో జరిగిన సీఎస్ఐఆర్-ఇస్రో అంతరిక్ష సమావేశం-2025

న్యూఢిల్లీ, నవంబర్ 18: భారత మానవ సహిత అంతరిక్ష నౌక మిషన్ అవసరాల కోసం బహుళ విభాగ పరిశోధన, సాంకేతిక అభివృద్ధి, సంస్థాగత సహకారాన్ని సమన్వయం చేస్తూ శాస్త్రీయ-పారిశ్రామిక పరిశోధన పరిషత్, భారత అంతరిక్ష పరిశోధన సంస్థలు సంయుక్తంగా బెంగళూరులో సీఎస్ఐఆర్-ఇస్రో స్పేస్ మీట్-2025ను నిర్వహించాయి. నోడల్ నిర్వహణ సంస్థ అయిన బెంగళూరులోని సీఎస్ఐఆర్ నేషనల్ ఏరోస్పేస్ లాబొరేటరీస్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది.

డీఎస్ఐఆర్ కార్యదర్శి, సీఎస్ఐఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎన్. కలైసెల్వి తన స్వాగత ప్రసంగంలో... భారత అంతరిక్ష సామర్థ్యాలను బలోపేతం చేయడంలో సీఎస్ఐఆర్ అందించిన శాస్త్రీయ, సాంకేతిక సహకారాన్ని వివరించారు. శాస్త్రవేత్తలు, పరిశోధకులు, వ్యోమగాములు, అంతర్జాతీయ నిపుణులు తమ విజ్ఞానాన్ని పంచుకునే వేదికగా ఈ సమావేశం విలువైన ఫలితాలను అందిస్తుందని, ఈ రంగంలో ఉన్న అంతరాలను పరిష్కరిస్తుందని ఆమె పేర్కొన్నారు. దేశ శాస్త్రీయ, సాంకేతిక లక్ష్యాలను ముందుకు తీసుకెళ్లడంలో గౌరవనీయ కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ మార్గదర్శకత్వాన్ని ప్రశంసిస్తూనే... స్వదేశీ ఆవిష్కరణలు, సహకారాత్మక పరిశోధనాభివృద్ధి పట్ల భారత్ నిబద్ధతను ఆమె ప్రధానంగా ప్రస్తావించారు.

అంతరిక్ష విభాగం కార్యదర్శి, ఇస్రో చైర్మన్ డాక్టర్ వి. నారాయణన్ మాట్లాడుతూ... గగన్‌యాన్ అంతరిక్ష కార్యక్రమానికి వివిధ మంత్రిత్వ శాఖలు, పరిశోధనాభివృద్ధి సంస్థలు, విద్యాసంస్థలు, భాగస్వామ్య సంస్థల సహకారం అవసరమన్నారు. సిబ్బంది కోసం తదుపరి తరం భద్రతా వ్యవస్థలు, అధునాతన లైఫ్-సపోర్ట్ సాంకేతికతలు, శాస్త్రీయ పేలోడ్ అభివృద్ధి సహా అభివృద్ధి చెందుతున్న మిషన్ ప్రాధాన్యాలను ఆయన వివరించారు. సీఎస్ఐఆర్, భారత జాతీయ పరిశోధనాభివృద్ధి వ్యవస్థల సహకారాన్ని ఆయన ప్రస్తావించారు. చంద్రునిపైకి భవిష్యత్తులో మానవ సహిత యాత్ర మిషన్, అంగారక గ్రహ అన్వేషణ, భారత అంతరిక్ష కేంద్రం ఏర్పాటు సహా భారత దీర్ఘకాలిక లక్ష్యాలను ఆయన తెలియజేశారు.

సీఎస్ఐఆర్-ఎన్ఏఎల్ డైరెక్టర్ డాక్టర్ అభయ్ ఎ. పాశిల్కర్ మాట్లాడుతూ సమావేశానికి హాజరైన వారిని స్వాగతించారు. భారత అంతరిక్ష రంగానికి, మానవ సహిత అంతరిక్ష నౌక ప్రయోగ లక్ష్యాలకు మద్దతునిచ్చే సాంకేతికతలు, మెటీరియల్ పరిశోధన, పరీక్షా సామర్థ్యాలను అభివృద్ధి చేయడం పట్ల ఎన్ఏఎల్ నిబద్ధతను పునరుద్ఘాటించారు.

ఈఎస్ఏ వ్యోమగామి (నాసా ఎస్టీఎస్-66, ఎస్టీఎస్ -84, ఎస్టీఎస్ -103) శ్రీ జీన్-ఫ్రాంకోయిస్ క్లెర్వాయ్ ప్రత్యేక వీడియో సందేశం ప్రపంచ దృక్పథాన్ని వివరించింది. మానవ సహిత అంతరిక్ష నౌక ప్రయోగాన్ని ముందుకు తీసుకెళ్లడంలో అంతర్జాతీయ సహకారం, సమష్టి శాస్త్రీయ అభ్యసన ప్రాముఖ్యాన్ని స్పష్టం చేసింది. అనుభవాలను పంచుకునే సమావేశాల్లో భాగంగా ఇస్రో వ్యోమగామి గ్రూప్ కెప్టెన్ ప్రశాంత్ బి. నాయర్... వ్యోమగామి శిక్షణ, మైక్రోగ్రావిటీ సిమ్యులేషన్స్, కార్యాచరణ సంసిద్ధత, పునరుద్ధరణ విధానాల గురించి తన అనుభవాలను అందించారు. భారత తొలి వ్యోమగామి వింగ్ కమాండర్ రాకేష్ శర్మ (రిటైర్డ్) తన 1984 సోయజ్ మిషన్ గురించి వివరించారు. అంతరిక్ష రంగంలో ఎన్ఏఎల్ దీర్ఘకాలిక సహకారాన్ని గుర్తించారు. శాంతియుత అన్వేషణ, మానవ కేంద్రిత పరిశోధనలు భారత మానవ సహిత అంతరిక్ష నౌక కార్యక్రమ లక్ష్యాలని ఇరువురు వ్యోమగాములు వివరించారు. సాంకేతిక, థీమాటిక్ సమావేశాల్లో అంతర్జాతీయ, జాతీయ నిపుణుల ప్రదర్శనలు భాగంగా ఉన్నాయి. వీటిలో మానవ సహిత అంతరిక్ష నౌక ఫిజియాలజీ గురించి డాక్టర్ లూయా రోకారో (ఈఎస్ఏ)... సహకార పరిశోధన దృక్పథాలపై డాక్టర్ అకికో ఒట్సు కా (జేఏఎక్స్ఏ)... మానవ- సాంకేతిక పరస్పర చర్య, సిబ్బందితో కూడిన మిషన్ల కోసం ఇంటర్‌ఫేస్ రూపకల్పనపై ప్రొఫెసర్ ప్రదీప్త బిశ్వాస్ (ఐఐఎస్‌సీ) ప్రజెంటేషన్ ఇచ్చారు. వికసిత్ భారత్ జాతీయ దార్శనికతకు అనుగుణంగా భారత మానవ సహిత అంతరిక్ష నౌక కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లడానికి శాస్త్ర-సాంకేతికతల కలయిక, మిషన్-ఆధారిత పరిశోధనాభివృద్ధి, బహుళ- సంస్థల సహకారాన్ని బలోపేతం చేయాలనే సమష్టి సంకల్పంతో సీఎస్ఐఆర్-ఇస్రో స్పేస్ మీట్-2025 ముగిసింది.

# రైతులకు అవగాహన అవసరం..



కర్నూలు, నవంబర్ 18: మిరప పంటకు కాయ కుళ్లు, కాయ మచ్చ వంటి వ్యాధులు నివారించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి రైతులకు సూచించారు. ఆదోని మండలం మదిరె గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మిరప పంట సాగును, ఎన్డిబిఎల్ జిన్నింగ్, ప్రెస్సింగ్, దాదా పీర్ మిల్ యూనిట్ లలో పత్తి కొనుగోలు ప్రక్రియను, అన్న క్యాంటీన్ లను జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు..

తొలుత మిరప పొలాలను సందర్శించి రైతులతో మాట్లాడి, వారి సమస్యలు, పంట పరిస్థితులు గురించి అడిగి తెలుసుకున్నారు..మిరప పంట సాగుకు ఎకరాకు ఎంత పెట్టుబడి వస్తుంది విత్తనాలు ఎక్కడ నుండి కొనుగోలు చేస్తున్నారు అనే విషయాలను కలెక్టర్ రైతులను అడిగి తెలుసుకున్నారు..

60శాతంకు పైగా మిరప పంటకు కాయ కుళ్ళు, కాయ మచ్చ వచ్చిందని రైతులు కలెక్టర్ కి చూపించారు. మిరప పంటకు కాయ కుళ్లు, కాయ మచ్చ వంటి వ్యాధులు నివారించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ వ్యవసాయ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు వ్యవసాయ అధికారులు రైతు సోదరులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి, సమయానుకూలమైన సూచనలు, సాంకేతిక మార్గదర్శకాలు అందించాలని కలెక్టర్ వ్యవసాయ అధికారులను ఆదేశించారు..

పత్తి రైతుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్లి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.. పత్తికి మంచి ధర వచ్చేందుకు వీలుగా రైతులు పత్తిని బాగా ఆరబెట్టుకొని తేమ శాతం లేకుండా తీసుకొని వచ్చే విధంగా చూసుకోవాలని కలెక్టర్ రైతులకు సూచించారు.. తేమ శాతం 14 ఉన్నా కూడా రైతుల నుండి పత్తిని కొనుగోలు చేసే విధంగా చూడాలని కలెక్టర్ సిసిఐ అధికారులకు సూచించారు.. తేమ శాతం కొంచెం ఎక్కువ ఉన్నప్పటికీ రైతులను వెనక్కు పంపకుండా, రైతులు నష్టపోకుండా కనీస మద్దతు ధరతో కొనుగోలు చేయాలని కలెక్టర్ సిసిఐ అధికారులను కోరారు..

పంట ఎక్కువగా ఉందని, మిల్లులు కొన్ని మాత్రమే ఓపెన్ అయ్యాయని, మిగిలిన మిల్లులను కూడా త్వరగా ఓపెన్ చేయించాలని, యాప్ లో స్లాట్ లు వెంటనే క్లోజ్ అవుతున్నాయని, సర్వర్ సమస్యలు ఉన్నట్లు సచివాలయం సిబ్బంది చెప్పున్నారని, పత్తి రైతులు వారి సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకొని రాగా వాటిని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు..

అన్న క్యాంటీన్ ద్వారా రుచి, శుచితో ఉన్న భోజనాన్ని ప్రజలకు అందించాలని కలెక్టర్ అన్న క్యాంటీన్ సిబ్బందిని ఆదేశించారు అక్కడే భోజనం చేస్తున్న యువకులు, మహిళలతో మాట్లాడుతూ భోజనం రుచిగా ఉందా సరిపోయేంత పెడుతున్నారా ప్రతి రోజు ఇక్కడే భోజనం చేస్తారా భోజన పరంగా ఏమైనా సమస్యలు ఉన్నాయా అన్న క్యాంటీన్ లోపల శుభ్రంగా ఉంచుతున్నారా అని కలెక్టర్ ఆరా తీశారు భోజనం రుచిగా పెడుతున్నారని, సరిపోయినంత పెడుతున్నారని, క్యాంటీన్ శుభ్రంగా ఉంచుతున్నారని, ప్రతి రోజు ఇక్కడే భోజనం చేస్తామని, భోజనం చాలా బాగుంటుందని వారి కలెక్టర్ కు తెలిపారు..

అనంతరం కలెక్టర్ నేరుగా భోజనం వండిస్తున్న ప్రదేశం వద్దకి వెళ్ళి అన్నం, సాంబార్ లను పరిశీలిస్తూ అక్కడే ఉన్న అన్న క్యాంటీన్ సిబ్బందితో మాట్లాడుతూ వచ్చిన ప్రజలకు సరిపోయేంత భోజనం పెడుతున్నారా మధ్యాహ్నం భోజనం ఏ సమయానికి ఇక్కడికి వస్తుంది ప్రతి రోజు ఎంతమంది భోజనం చేస్తున్నారు సమస్యలు ఏమైనా ఉన్నాయా, అని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు అనంతరం అన్న క్యాంటీన్ లో భోజనం చేస్తున్న ప్రజలకు కలెక్టర్ స్వయంగా వండించారు..కార్యక్రమంలో ఆదోని ఇంచార్జి సబ్ కలెక్టర్ అజయ్, జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి, మార్కెటింగ్ ఏడి నారాయణ మూర్తి, ఆదోని తహసీల్దార్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాల వినియోగంపై కఠిన చర్యలు..

నిజామాబాద్, నవంబర్ 18: మత్తు పదార్థాల వల్ల యువత తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని.. మీ భవిష్యత్తును, మీ కుటుంబాన్ని, సమాజాన్ని బాధ్యతతో కాపాడాలని, గంజాయి ఇతర మత్తు పదార్థాలను నిర్దాక్షిణ్యంగా తిరస్కరించాలని కమ్మర్ పల్లి ఎస్ఐ జి. అనిల్ రెడ్డి పేర్కొన్నారు.

ఈ రోజు కమ్మర్ పల్లి మండలంలోని ఉప్లూర్ జడ్.పి.హెచ్.ఎస్‌లో గంజాయి, మత్తు పదార్థాల నియంత్రణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ అనిల్ రెడ్డి మాట్లాడుతూ 15 ఏళ్ల నుండి 25 ఏళ్ల వయసులో ఉన్న వారు ఎక్కువగా మాదకద్రవ్యాల బారిన పడే అవకాశముందని, పిల్లల ప్రవర్తనలో అసాధారణ రీతిలో మార్పులు కనిపిస్తున్నా, సాధారణ స్థాయిని మించి డబ్బులు ఖర్చు పెడుతున్నా, ఆ పిల్లల పై తల్లితండ్రులు దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంటుందని అన్నారు. మత్తు పదార్థాల దుర్వినియోగం, అక్రమ రవాణాకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. యువత మత్తులో చిత్తవుతున్నారని, మాదకద్రవ్యాల రవాణ, వినియోగాన్ని నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, డ్రగ్స్ ను విక్రయించినా, రవాణ చేసినా, వినియోగించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

# రైల్వే స్టేషన్ అభివృద్ధి పనుల వేగం పెంచండి

## -రైల్వే డీఆర్ఎమ్ మోహిత్ సోనాకియాతో ఎంపీ కేశినేని శివనాథ్ భేటీ..
## -ఎన్టీఆర్ జిల్లా పరిధిలోని పెండింగ్ రైల్వే సమస్యలపై చర్చ



విజయవాడ, నవంబర్ 18:ఎన్టీఆర్ జిల్లా పరిధిలోని పెండింగ్ లో వున్న రైల్వే సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని దక్షిణ మధ్య రైల్వే డీఆర్ఎం మోహిత్ సోనాకియాను ఎంపీ కేశినేని శివనాథ్ కోరారు. డీఆర్ఎంగా మోహిత్ సోనాకియా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటి సారి కలిసిన ఎంపీ కేశినేని శివనాథ్ ఆయనకు అభినందనలు తెలిపి విజయవాడ పార్లమెంటు పరిధిలో ఉన్న రైల్వే ప్రాజెక్టులపై మాట్లాడారు.

ఈ భేటీ లో ఎంపీ కేశినేని శివనాథ్ విజయవాడ రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు, కొండపల్లి రైల్వే స్టేషన్ ప్లాట్ ఫామ్ విస్తరణ పనులతో పాటు లెవల్ క్రాసింగ్ గేట్ల అంశం పై చర్చించారు. అలాగే వాంబే కాలనీ మధురానగర్ మధ్య ఎల్.హెచ్.ఎస్. నిర్మాణం త్వరగా చేపట్టాని కోరారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో ట్రాఫిక్ సమస్య నివారించేందుకు, ప్రజల రాకపోకల ఇబ్బందులు తొలగించేందుకు కె.ఎల్.రావు బ్రిడ్జ్ (ఎర్ర కట్ట) వద్ద ఆర్.యు.బి లు నిర్మించాలని కోరారు. అలాగే ఆర్.వో.బి, ఆర్.యు.బిల నిర్మాణానికి అన్ని అనుమతులు వచ్చిన లెవెల్ క్రాసింగ్ నెం. 316, లెవెల్ క్రాసింగ్ నెం. 147 , లెవెల్ క్రాసింగ్ నెం. 148, లెవెల్ క్రాసింగ్ నెం.8 నిర్మాణానికి టెండర్లు త్వరగా పిలిచి, ప్రాజెక్ట్ లను పట్టాలెక్కించాలన్నారు.ఎంపీ కేశినేని శివనాథ్ అభ్యర్థనలపై డీఆర్ఎం మోహిత్ సోనాకియా సానుకూలంగా స్పందించారు.

# ఇసుక కొరత లేకుండా చూడండి

నారాయణపేట, నవంబర్ 18: ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఇసుక కొరత లేకుండా సకాలంలో ఇసుక తరలించే విధంగా చూడాలని ఊట్కూర్ తాసిల్దార్ చింతా రవి ఆదేశించారు. ఈ రోజు నారాయణపేట జిల్లా ఊట్కూర్ తాసిల్దార్ కార్యాలయంలో ఇందిరమ్మ ఇండ్లకు సరఫరా చేసే ట్రాక్టర్ యజమానులతో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా పేద ప్రజలకు ఇండ్లు నిర్మించాలనే లక్ష్యంతో ఇందిరమ్మ ఇండ్లకు నాగిరెడ్డిపల్లి పెద్దవాగు కు కలెక్టర్ ఇసుక రీచ్ కేటాయించారని అన్నారు. ఇసుక రీచ్ వద్ద ఎస్ఆర్ఏ ఆలస్యంగా రావడం వల్ల లబ్ధిదారులకు సకాలంలో ఇసుక సరఫరా చేయలేకపోతున్నామని పలువురు ట్రాక్టర్ యజమానులు తాసిల్దార్ దృష్టికి తీసుకువచ్చారు. ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఇసుక తరలించేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. అందుకు స్పందించిన తాసిల్దార్ ఇసుక రీచ్ వద్ద ఉన్న ఎస్ ఆర్ ఏ సకాలంలో విధులకు రావాలనిఆదేశించారు.

ఇసుక రీచ్ నుండి నారాయణపేట ధన్వాడ మండలాలకు ఇసుక తరలింపులో జాప్యం జరుగుతుందని ఉదయం 6 గంటల నుండి సాయంత్రం5గంటల వరకు ఇసుక తరలించేందుకు అనుమతి ఇస్తానని తాసిల్దార్ హామీ ఇచ్చారు. ఊట్కూర్, నారాయణపేట ధన్వాడ మండలాల్లో ఇసుక రీచ్ కు కేటాయించిన గ్రామాలకు త్వరితగతిన ఇసుక పంపిణీ చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రమేష్,మండల కాంగ్రెస్ అధ్యక్షులు డి. యగ్నేశ్వర్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి సూర్యప్రకాశ్ రెడ్డి, నాగిరెడ్డిపల్లి నాయకులు గోవింద్ గౌడ్ , చెన్నప్ప, బస్వరాజ్ తదితరులుపాల్గొన్నారు.

# టెస్టుల పేరుతో 500 కోట్లు దుబారా




ఊట్కూర్, నవంబర్ 18: ప్రైవేటు కంపెనీలకు ఇచ్చిన ఇన్సూరెన్స్ లో అనుమతులను వెంటనే రద్దు చేయాలని టీయుసీఐనారాయణపేట జిల్లా అధ్యక్షుడు కిరణ్, టీపీబీ ఓసీ జిల్లా అధ్యక్షుడు బీ. నరసింహా డిమాండ్ చేశారు. ఈ రోజు నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండల పరిధిలోని టీయుసీఐ మండల సమావేశం చెన్నప్ప అధ్యక్షతన నిర్వహించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రంలో ఉన్న నరేంద్ర మోడీ ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబరు కోడ్స్ వల్ల భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు అమలు చేస్తున్న ప్రమాద మరణాలకు రూ.10 లక్షలు సహజ మరణాలకు రూ.2 లక్షలకు పెంచి, శాశ్వత, పాక్షిక అంగవైకల్యం ఈ నాలుగు సంక్షేమ పథకాలను ప్రైవేట్ ఇన్స్యూరెన్స్ కంపెనీల ద్వారా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం జిఓ నెం.12 ను 2025 జులై 22న విడుదల చేసిందన్నారు.

జీఓ విడుదల చేసిన 2 రోజులకే (ప్రైవేట్ బీమా కంపెనీలైన క్రెడిట్ యాక్సిస్ లైఫ్ ఇన్స్యూరెన్స్ కంపెనీకి రూ.250 కోట్లు, ఎర్గో జనరల్ ఇన్స్యూరెన్స్ కంపెనీకి రూ.95 కోట్లు, ట్రెయిల్ బ్లేజర్ అనే బ్రోకర్ సంస్థ ద్వారా మొత్తం రూ. 340 కోట్లు ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు ప్రభుత్వ అధికారులు అక్రమంగా బదిలీ చేశారని ఆరోపించారు. కేంద్ర చట్టం, రాష్ట్ర వెల్ఫేర్ బోర్డునిబంధనలకు విరుద్ధంగా నిధులు దారి మళ్ళించడాన్ని భవన నిర్మాణ కార్మిక సంఘంగా తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

సిఎస్సి హెల్త్ టెస్టుల పేరుతో ప్రభుత్వం సుమారు రూ.500 కోట్లు దుర్వినియోగం చేసిందని ఆరోపించారు. కార్మికులకు అవసరం లేకున్నా హెల్త్ టెస్టు చేయించుకోకపోతే లేబర్ కార్డులు తొలగిస్తామని కార్మికులను బెదిరిస్తూ, టెస్టులు చేస్తు 33 జిల్లాల్లో 17, కేంద్రాలను ఎంపిక చేసుకొని 7 మంది ల్యాబ్ మేనేజర్లను పెట్టి ఈ టెస్టు చేస్తున్నారని అన్నారు. టెస్టు ఒక్కో కేంద్రంలో రోజుకు 100 నుండి 150 వరకు టెస్టు చేస్తు ఒక కార్మికునికి టెస్ట్ చేస్తే రూ. 3,250లు సిఎస్సి సంస్థకు బోర్డు నుండి చెల్లిస్తున్నారు.

రోజువారీగా 7 సెంటర్లలో సుమారు 1,000 మందికి టెస్ట్ చేస్తున్నట్లు తెలిపారు. ఒక్కరోజు రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల్లో 1,000 మంది కార్మికులకు టెస్ట్ చేస్తూ టెస్ట్ చేసిన ఎంప్లాయికి సిఎస్సి సంస్థ వారు రూ.90ల చొప్పున చెల్లిస్తూ ఒక నెలకు 30,000 మందికి, సంవత్సరానికి 3,60,000 మందిక టెస్టు చేస్తున్నారని అన్నారు. వెల్ఫేర్ బోర్డు నుండి సుమారు రూ.500 కోట్లు టెస్ట పేరుతో దుబారా ఖర్చు చేశారన్నారు. ఈనెల 25 న చేపట్టే చలో కలెక్టరేట్ కార్యక్రమానికి తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తాపీ మేస్త్రి సంఘం నాయకుడు ఊట్కూర్ గ్రామ అధ్యక్షుడు నాగేష్, కనకరాయుడు, నరసింహ, హన్మంతు, వెంకటేష్, అశోక్, కోళ్ల కృష్ణయ్య, చిన్న బాలు, జనార్ధన్, కిష్టప్ప, శివప్ప తదితరులు పాల్గొన్నారు.

# 'ఆసియా ఆర్చరీ ఛాంపియన్‌షిప్ 2025'లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన భారత విలువిద్య క్రీడాకారుల జట్టును అభినందించిన ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, నవంబర్ 18:'ఆసియా ఆర్చరీ ఛాంపియన్‌షిప్ 2025'లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన భారత విలువిద్య క్రీడాకారుల జట్టును ప్రధాన మంత్రి శ్రీ నరేంద్రమోదీ అభినందించారు.

ఈ పోటీలో దేశ విలువిద్య జట్టు అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చిందని, 6 స్వర్ణాలు సహా మొత్తం 10 పతకాలను సాధించిందని శ్రీ మోదీ అన్నారు. 18 సంవత్సరాల తర్వాత సాధించిన చారిత్రాత్మక రికర్వ్ పురుషుల విభాగంలో స్వర్ణ పతకం సాధించడాన్ని ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. వ్యక్తిగత విభాగాల్లో ఉత్తమ ప్రదర్శనలు, కాంపౌండ్ విభాగంలో విజయవంతమైన టైటిల్ రక్షణలు కూడా ప్రధానమంత్రి ప్రశంసించారు.

# భారత్ కేవలం అభివృద్ధి చెందుతున్న మార్కెట్ మాత్రమే కాదు.. ఇది అభివృద్ధికి నమూనా: పీఎం

న్యూఢిల్లీ, నవంబర్ 18: ఇవాళ న్యూఢిల్లీలో ఆంగ్ల దిన పత్రిక "ది ఇండియన్ ఎక్స్ ప్రెస్" నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ రామ్‌నాథ్ గోయెంకా ఆరో ఉపన్యాసాన్ని అందించారు. ఈ సందర్భంగా శ్రీ నరేంద్ర మోదీ మాట్లాడుతూ... దేశంలో ప్రజాస్వామ్యం, జర్నలిజం, భావవ్యక్తీకరణ, ప్రజా ఉద్యమాల శక్తిని పెంచిన మహోన్నత వ్యక్తిని గౌరవించడంలో భాగంగా మనమంతా ఇక్కడ సమావేశమైనట్లు తెలిపారు. రామ్‌నాథ్ గోయెంకా.. దార్శనికత కలిగిన వ్యక్తి, సంస్థ స్థాపకుడు, జాతీయవాది, మీడియా నాయకుడని ప్రధానమంత్రి కొనియాడారు. ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్ సంస్థను కేవలం వార్తాపత్రికగా కాకుండా భారత ప్రజల కోసం ఒక యజ్ఞం లా ప్రారంభించారన్నారు. రామ్‌నాథ్ నాయకత్వంలో ప్రజాస్వామ్య విలువలు, జాతీయ ప్రయోజనాల గొంతుకగా ఈ సంస్థ మారిందని స్పష్టం చేశారు. 21వ శతాబ్దంలో అభివృద్ధి చెందిన భారత్‌గా మారేందుకు ప్రయత్నిస్తున్న తరుణంలో, రామ్‌నాథ్ గోయెంకా నిబద్ధత, కృషి, దార్శనికత స్ఫూర్తిగా నిలుస్తాయని తెలిపారు. ఉపన్యాసం ఇచ్చేందుకు తనను ఆహ్వానించిన ఇండియన్ ఎక్స్‌ప్రెస్ సంస్థకు ధన్యవాదాలు చెప్పిన ప్రధానమంత్రి.. కార్యక్రమంలో పాల్గొన్న వారందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

భగవద్గీతలోని ఒక శ్లోకం నుంచి రామ్‌నాథ్ గోయెంకా స్ఫూర్తిని పొందారని, దాని ప్రకారం సుఖ దుఃఖాలు, లాభ నష్టాలు, గెలుపోటములను సమానంగా చూస్తూ తమ కర్తవ్యాన్ని నిర్వర్తించటమనేవి ఆయన జీవితంలోనూ, పనిలోనూ అంత లీనంగా కనిపిస్తాయన్నారు. ఈ సిద్ధాంతాన్ని రామ్‌నాథ్ గోయెంకా జీవితాంతం పాటించారని, అన్నిటికంటే కర్తవ్యానికి అధిక ప్రాధాన్యతనిచ్చారని శ్రీ నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. స్వాతంత్ర్యోద్యమ సమయంలో ఇండియన్ నేషనల్ కాంగ్రెస్‌కు మద్దతిచ్చిన రామ్‌నాథ్ గోయెంకా, తర్వాత జనతా పార్టీలో చేరారని, జనసంఘ్ టికెట్‌పై ఎన్నికల్లో పోటీ చేసినట్లు చెప్పారు. ఆయన భావజాలం ఏదైనప్పటికీ, జాతీయ ప్రయోజనాలకే ప్రాధాన్యతనిచ్చేవారన్నారు. రామ్‌నాథ్ గారితో పనిచేసిన వారు, ఆయన చెప్పిన వాటిని స్మరించుకుంటారని ప్రధానమంత్రి తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత హైదరాబాద్‌లో రజాకార్లు దౌర్జన్యం చేసినపుడు సర్దార్ పటేల్‌కు రామ్‌నాథ్ సహకరించిన పరిస్థితుల్ని గుర్తు చేశారు. 1970లో బీహార్ విద్యార్థి ఉద్యమానికి నాయకత్వం అవసరమైనప్పుడు నానాజీ దేశ్‌ముఖ్‌తో కలిసి శ్రీ జయప్రకాశ్ నారాయణ్‌ను ఉద్యమానికి నాయకత్వం వహించాలని రామ్‌నాథ్ గారు ఒప్పించారని తెలిపారు. ఎమర్జెన్సీ సమయంలో, నాటి ప్రధానమంత్రికి అత్యంత సన్నిహితులైన మంత్రుల్లో ఒకరు రామ్‌నాథ్ గారిని పిలిపించి జైలు శిక్ష విధిస్తామని బెదిరించినప్పుడు, ఆయన చెప్పిన ధైర్యవంతమైన సమాధానం చరిత్రపుటల్లో రహస్యంగా ఉందన్నారు. ఈ కథనాల్లో కొన్ని బయట ప్రపంచానికి తెలిసినా, మరికొన్ని తెలియక పోయినా, అవన్నీ రామ్‌నాథ్ గారి నిజాయితీని నిలబెట్టాలనే నిబద్ధతను, ఎవరికీ భయపడకుండా తన కర్తవ్యానికి కట్టుబడి ఉండే స్థిర వైఖరిని ప్రతిబింబిస్తాయని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు.

రామ్‌నాథ్ గోయెంకాని అసహనంతో ఉండే వ్యక్తిగా వర్ణించేవారని అయితే అది ప్రతికూల కోణంలో కాదని, సానుకూల విధానమని శ్రీ నరేంద్ర మోదీ తెలిపారు. మార్పు కోసం అత్యున్నత స్థాయిలో కృషి చేసే అసహనం, స్తంభించిపోయిన నీటిని కూడా కదిలించే అసహనమని స్పష్టం చేశారు. ప్రధానమంత్రి ఒక పోలికను ప్రస్తావిస్తూ, "నేటి భారతదేశం కూడా అసహనంతో ఉంది అభివృద్ధి చెందటానికి, స్వయం సమృద్ధి సాధించేందుకు ఉవ్విళ్లూరుతోంది" అని అన్నారు. 21వ శతాబ్దంలో మొదటి ఇరవై ఐదేళ్లు చాలా వేగంగా గడిచిపోయాయని, ఒకదాని తర్వాత మరో సవాలు ఎదురవుతూనే ఉన్నప్పటికీ, అవి భారత్ వృద్ధిని ఆపలేకపోయాయని అన్నారు.

గడిచిన నాలుగైదేళ్లు ప్రపంచం సవాళ్లతో నిండిపోయిందనీ, 2020లో కోవిడ్-19 మహమ్మారి ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక వ్యవస్థలను అస్థిరపరిచి, అనిశ్చితిని సృష్టించిందని ప్రధానమంత్రి అన్నారు. ప్రపంచవ్యాప్తంగా సరఫరా వ్యవస్థ తీవ్రంగా ప్రభావితమై జనం అగాధంలోకి పడిపోయే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. పరిస్థితులు చక్కదిద్దుకుంటున్న సమయంలో, పొరుగు దేశాల్లో సంక్షోభం తలెత్తిందని, ఇన్ని సవాళ్ల మధ్య కూడా భారత ఆర్థిక వ్యవస్థ అధిక వృద్ధి రేటును సాధించి, స్థిరత్వాన్ని ప్రదర్శించిందని వెల్లడించారు. 2022లో వచ్చిన ఐరోపా సంక్షోభం వల్ల అంతర్జాతీయ సరఫరా వ్యవస్థ, ఇంధన మార్కెట్లు ప్రభావితం కాగా, మొత్తం ప్రపంచంపై ఈ ప్రభావం పడిందని శ్రీ నరేంద్ర మోదీ తెలిపారు. పశ్చిమాసియాలో 2023లో పరిస్థితులు క్షీణించినప్పటికీ, భారత్ వృద్ధి పథంలో నిలిచిందన్నారు. ప్రపంచవ్యాప్తంగా అనిశ్చితి ఉన్నప్పటికీ, ఈ ఏడాది కూడా దేశ వృద్ధి రేటు సుమారు 7 శాతంగా ఉందని ఆయన స్పష్టం చేశారు.

"అస్థిర పరిస్థితుల దృష్ట్యా ప్రపంచం జంకుతున్న తరుణంలో, ఉజ్వల భవిష్యత్తు దిశగా భారత్ ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతోంది" అని ప్రధాన మంత్రి తెలిపారు. "భారత్ కేవలం అభివృద్ధి చెందుతున్న మార్కెట్ మాత్రమే కాదు.. ఇది అభివృద్ధికి నమూనా" అని స్పష్టం చేశారు. ఇవాళ భారత్ అభివృద్ధి నమూనాని విశ్వసనీయమైనదిగా ప్రపంచం చూస్తోందన్నారు.

బలమైన ప్రజాస్వామ్యాన్ని అనేక ప్రమాణాల ఆధారంగా పరీక్షిస్తారని, వాటిలో అత్యంత ముఖ్యమైనది ప్రజల భాగస్వామ్యమని శ్రీ నరేంద్ర మోదీ తెలిపారు. ప్రజాస్వామ్యంలో ప్రజల నమ్మకం, ఆశావాదం ఎన్నికల సమయంలో స్పష్టమవుతుందన్నారు. నవంబర్ 14న ప్రకటించిన ఫలితాలు చరిత్రాత్మకమైనవని, ప్రజల భాగస్వామ్యం పెరగటాన్ని ఏ ప్రజాస్వామ్యమూ నిర్లక్ష్యం చేయలేదని చెప్పారు. బీహార్ చరిత్రలోనే ఈసారి అత్యధిక ఓటింగ్ నమోదైందని, అందులోనూ మహిళల ఓటింగ్ శాతం పురుషుల కంటే సుమారు తొమ్మిది శాతం ఎక్కువగా ఉందని వెల్లడించారు. ఇది కూడా ప్రజాస్వామ్య విజయమేనని ఆయన స్పష్టం చేశారు.

బీహార్ ఎన్నికల ఫలితాలు మరోసారి భారత ప్రజల ఉన్నతమైన ఆకాంక్షలను ప్రదర్శించాయని ప్రధానమంత్రి అన్నారు. తమ ఆకాంక్షలను నెరవేర్చడానికి, అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వడానికి నిజాయితీతో పనిచేసే రాజకీయ పార్టీలపైనే నేడు ప్రజలు తమ విశ్వాసాన్ని ఉంచుతున్నారని ఆయన పేర్కొన్నారు. ప్రతి రాష్ట్ర ప్రభుత్వం వారి భావజాలం - అది అతివాదమైనా, మితవాదమైనా, మధ్యస్థమైనా - బీహార్ ఫలితాల నుంచి పాఠాన్ని గ్రహించాలని ప్రధానమంత్రి కోరారు. ఈ రోజు అందించే పాలనా విధానం, రాబోయే సంవత్సరాల్లో రాజకీయ పార్టీల భవిష్యత్తును నిర్ణయిస్తుందని పేర్కొన్నారు. బీహార్ ప్రజలు 15 సంవత్సరాలపాటు ప్రతిపక్షానికి అవకాశం ఇచ్చారని, రాష్ట్ర అభివృద్ధికి గణనీయంగా తోడ్పడే అవకాశం ఉన్నప్పటికీ, వారు ఆటవిక పాలన మార్గాన్ని ఎంచుకున్నారని ఆయన అన్నారు. ఈ నమ్మక ద్రోహాన్ని బీహార్ ప్రజలు ఎన్నటికీ మర్చిపోరని ప్రధానమంత్రి అన్నారు. కేంద్ర ప్రభుత్వమైనా లేక రాష్ట్రాల్లోని వివిధ పార్టీల నేతృత్వంలోని ప్రభుత్వాలైనా వాటి అత్యధిక ప్రాధాన్యత అభివృద్ధికి మాత్రమే, కేవలం అభివృద్ధికి మాత్రమే ఉండాలని ఆయన స్పష్టం చేశారు. మెరుగైన పెట్టుబడి వాతావరణం సృష్టించడంలోనూ, వ్యాపార నిర్వహణను సులభతరం చేయడంలోనూ, అభివృద్ధి సూచీలను ముందుకు తీసుకెళ్లడంలోనూ పరస్పరం పోటీపడాలని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు శ్రీ మోదీ పిలుపునిచ్చారు. ఇటువంటి ప్రయత్నాలు ప్రజల విశ్వాసాన్ని చూరగొంటాయని ఆయన తెలిపారు.

బీహార్ ఎన్నికల విజయం తరువాత, తమను సమర్థించే కొందరు మీడియా ప్రముఖులు సహా కొంతమంది వ్యక్తులు బీహార్ ఎన్నికల విజయం తరువాత, తాము, తమ పార్టీ, నిరంతర ఎన్నికలే అన్నట్లుగా పనిచేస్తున్నామన్నారని శ్రీ మోదీ గుర్తుచేశారు. అయితే ఎన్నికల్లో గెలవడానికి ఎన్నికలే వని అన్నట్లుగా ఉండాల్సిన అవసరం లేదని, నిరంతరం మానసిక భావోద్వేగంలో ఉంటే చాలన్నది తన సమాధానమని ఆయన చెప్పారు. ఒక నిమిషం కూడా వృథా చేయకుండా పేదల కష్టాలను తగ్గించాలని, ఉపాధి కల్పించాలని, ఆరోగ్య సేవల్ని అందించాలని, మధ్యతరగతి ఆకాంక్షలను నెరవేర్చాలని మనసులో తపన ఉన్నప్పుడు నిరంతర శ్రమ సహజంగానే ముందుకు నడిపే శక్తిగా మారుతుందని ప్రధానమంత్రి తెలిపారు. ఈ భావోద్వేగంతోనూ, నిబద్ధతతోనూ పాలన సాగిస్తే దాని ఫలితాలు ఎన్నికల రోజున, ఇప్పుడు బీహార్‌లో చూసినట్లుగా కనిపిస్తాయని ప్రధానమంత్రి చెప్పారు.

శ్రీ రామనాథ్ గోయెంకా విదిశ నుంచి జనసంఘ్ టికెట్ పొందిన సందర్భంగా జరిగిన సంఘటనను ప్రస్తావిస్తూ, అప్పుడు రామనాథ్, నానాజీ దేశ్‌ముఖ్‌ల మధ్య సంస్థ ముఖ్యమా, వ్యక్తి ముఖ్యమా అనే అనే చర్చ జరిగిందని, నామినేషన్ దాఖలు చేయడానికి, తరువాత విజయ ధ్రువీకరణ పత్రాన్ని తీసుకోవడానికి మాత్రమే రామనాథ్ వస్తే చాలని నానాజీ దేశ్‌ముఖ్ ఆయనతో చెప్పారని శ్రీ మోదీ పేర్కొన్నారు.

అనంతరం నానాజీ పార్టీ కార్యకర్తల ద్వారా ప్రచారాన్ని నడిపించి, రామనాథ్ కు గెలుపు అందించారని, ఈ కథను పంచుకోవడంలో తన ఉద్దేశం కేవలం అభ్యర్థులు నామినేషన్లు మాత్రమే దాఖలు చేయాలని సూచించడం కాదని, పార్టీలోని లెక్కలేనంత మంది కార్యకర్తల నిబద్ధతను తెలియజేయడమే అని శ్రీ మోదీ స్పష్టం చేశారు. లక్షలాది మంది కార్యకర్తలు తమ స్వేదంతో తమ పార్టీలను పోషించారని, ఇప్పటికీ అలాగే చేస్తున్నారని ఆయన చెప్పారు. కేరళ, పశ్చిమ బెంగాల్, జమ్మూ కాశ్మీర్ వంటి రాష్ట్రాలలో, వందలాది మంది కార్యకర్తలు పార్టీ కోసం తమ రక్తాన్ని కూడా త్యాగం చేశారని ఆయన తెలిపారు. అంతటి నిబద్ధత కలిగిన కార్యకర్తలు ఉన్న పార్టీకి కేవలం ఎన్నికల్లో గెలవడం మాత్రమే లక్ష్యం కాదని, నిరంతర సేవ ద్వారా ప్రజల హృదయాలను గెలుచుకోవడమే లక్ష్యమని శ్రీ మోదీ పేర్కొన్నారు.

దేశ అభివృద్ధికి దాని ప్రయోజనాలు ప్రతి ఒక్కరికీ చేరడం అత్యవసరమని స్పష్టం చేస్తూ, ప్రభుత్వ పథకాలు దళితులు, అణగారిన వర్గాలు, దోపిడీకి గురైన వారు, వెనుకబడిన వారికి చేరినప్పుడే నిజమైన సామాజిక న్యాయం సాధ్యమవుతుందని ప్రధానమంత్రి అన్నారు. గత దశాబ్దాలలో, సామాజిక న్యాయం పేరుతో, కొన్ని పార్టీలు, కుటుంబాలు తమ స్వార్థ ప్రయోజనాలను నెరవేర్చుకున్నాయని ఆయన విమర్శించారు.

సామాజిక న్యాయం వాస్తవ రూపంలోకి మారడాన్ని ఈ రోజు దేశం చూస్తోందని ఆయన సంతృప్తి చేశారు. 12 కోట్ల మరుగుదొడ్ల నిర్మాణాన్ని ఉదాహరణగా పేర్కొంటూ, వీటి వల్ల ఇంతవరకు బహిరంగ ప్రదేశాల్లో విసర్జన చేయాల్సిన పరిస్థితిలో ఉన్న కోట్లాది మందికి గౌరవం లభించిందని చెప్పారు. గత ప్రభుత్వాలు బ్యాంక్ ఖాతాకు కూడా అర్హులుగా పరిగణించని వారికి 57 కోట్ల జన్ ధన్ బ్యాంక్ ఖాతాలు ఆర్థిక భాగస్వామ్యాన్ని అందించాయని ఆయన పేర్కొన్నారు. 4 కోట్ల పక్కా గృహాలు పేదలకు కొత్త కలలు కనే శక్తిని ఇచ్చాయని, ప్రమాదాలు ఎదుర్కొనే సామర్థ్యాన్ని పెంచాయని ఆయన తెలిపారు.

గత 11 సంవత్సరాలలో సామాజిక భద్రతపై చేసిన కృషి అద్భుతమైనదని, దశాబ్దం కిందట కేవలం 25 కోట్ల మంది మాత్రమే సామాజిక భద్రత పరిధిలో ఉండేవారని, అయితే నేడు దాదాపు 94 కోట్ల మంది భారతీయులు ఆ పరిధిలో ఉన్నారని ప్రధానమంత్రి ప్రముఖంగా తెలిపారు. ఇదే నిజమైన సామాజిక న్యాయం అని ఆయన అన్నారు. ప్రభుత్వం సామాజిక భద్రతా పరిధిని విస్తరించడమే కాకుండా, అర్హులైన లబ్ధిదారులలో ఎవరినీ వదలకుండా చూసే 'సంతృప్త' లక్ష్యంతో కూడా పనిచేస్తోందని శ్రీ మోదీ చెప్పారు. ప్రతి లబ్ధిదారుడి వద్దకు చేరే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేసినప్పుడు, వివక్షకు ఎటువంటి అవకాశం ఉండదని ఆయన అన్నారు. ఇటువంటి ప్రయత్నాల ఫలితంగా, గత 11 సంవత్సరాలలో 25 కోట్ల మంది ప్రజలు పేదరికాన్ని అధిగమించారని, ఈ కారణంగానే 'ప్రజాస్వామ్యం ఫలితాలను ఇస్తుంది' అని నేడు ప్రపంచం అంగీకరిస్తోందని ఆయన వ్యాఖ్యానించారు.

ఆకాంక్ష జిల్లాల కార్యక్రమాన్ని ప్రధానమంత్రి మరో ఉదాహరణగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని అధ్యయనం చేయాలని ఆయన ప్రజలను కోరారు, దేశంలోని 100కు పైగా జిల్లాలను గత ప్రభుత్వాలు వెనుకబడినవిగా ముద్ర వేసి, నిర్లక్ష్యం చేశాయని ఆయన గుర్తు చేశారు. ఈ జిల్లాలను అభివృద్ధి చేయడం చాలా కష్టమని భావించేవారని, అక్కడ నియమితులైన అధికారులను శిక్షకు గురైనవారిగా చూసేవారని ఆయన తెలిపారు. ఈ వెనుకబడిన జిల్లాల్లో 25 కోట్ల మందికి పైగా పౌరులు నివసిస్తున్నారని, ఇది సమ్మిళిత అభివృద్ధి ప్రాముఖ్యతను తెలియచేస్తుందని అన్నారు.

ఈ వెనుకబడిన జిల్లాలు అభివృద్ధి చెందకుండా ఉండి ఉంటే, భారతదేశం రాబోయే వంద సంవత్సరాలలో కూడా అభివృద్ధిని సాధించలేకపోయేదని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. అందుకే ప్రభుత్వం కొత్త వ్యూహాన్ని అనుసరించిందని, రాష్ట్ర ప్రభుత్వాలను భాగస్వాములను చేసి, ప్రతి జిల్లా ఏ అభివృద్ధి అంశాలలో వెనుకబడి ఉందో తెలుసుకోవడానికి సమగ్ర అధ్యయనాలు నిర్వహించిందని ఆయన పేర్కొన్నారు. ఈ అధ్యయనాల ఆధారంగా, ప్రతి జిల్లాకు అనుగుణంగా వ్యూహాలను రూపొందించినట్టు ప్రధాని చెప్పారు. దేశంలో అత్యుత్తమ అధికారులను - మెరుగైన ప్రతిభ, వినూత్న ఆలోచనలు కలిగిన వారిని - ఆయా ప్రాంతాల్లో నియమించామని శ్రీ మోదీ పేర్కొన్నారు. ఈ జిల్లాలను ఇక వెనుకబడినవిగా కాకుండా, ఆకాంక్ష జిల్లాలుగా పునర్నిర్వచించారని, నేడు, ఈ జిల్లాల్లో చాలా జిల్లాలు ఆయా రాష్ట్రాల్లోని ఇతర జిల్లాల కంటే పలు అభివృద్ధి సూచీలలో ముందంజలో నిలుస్తున్నాయని వివరించారు.

ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్‌ను ఉదాహరణగా పేర్కొంటూ, ఆ ప్రాంతాన్ని సందర్శించడానికి పాత్రికేయులకు ఒకప్పుడు పరిపాలనా అధికారుల నుంచి కంటే ప్రభుత్వేతర సంస్థల నుంచి అనుమతులు ఎక్కువగా అవసరమయ్యేవని శ్రీ మోదీ గుర్తు చేశారు. నేడు, అదే బస్తర్ అభివృద్ధి మార్గంలో పురోగమిస్తోందని, బస్తర్ ఒలింపిక్స్‌కు 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' ఎంత ప్రచారం ఇచ్చిందో సరిగా చెప్పలేను గానీ బస్తర్ యువత ఇప్పుడు ఒలింపిక్స్ వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్న తీరు చూసి శ్రీ రామనాథ్ గోయెంకా చాలా సంతోషించేవారని ఆయన అన్నారు.

బస్తర్ గురించి చర్చించినప్పుడు, నక్సలిజం లేదా మావోయిస్ట తీవ్రవాదం సమస్యను కూడా పరిష్కరించడం అత్యవసరం అని ప్రధానమంత్రి శ్రీ మోదీ పేర్కొన్నారు. నక్సలిజం ప్రభావం దేశవ్యాప్తంగా తగ్గిపోతున్నప్పటికీ, అది ప్రతిపక్ష పార్టీలో సజీవంగా ఉందని ఆయన అన్నారు.

# అర్హులైన గీత కార్మికుడికి గుర్తింపు కార్డులను మంజూరు చేయడం జరుగుతుంది.. ఎస్సై శంకర్‌మ



హబూబాబాద్, నవంబర్18 (నేటి నిజం) పెద్దవంగర మండలం గంట్లకుంట గ్రామంలో గీత కార్మికుల సొసైటీ గుర్తింపు కార్డుల గురించి ట్యాడీ టాపింగ్ టెస్టింగ్ తొర్రూర్ ఎక్సైజ్ సబ్ ఇన్స్పెక్టర్ ఎన్ శంకర్ సమక్షంలో నిర్వహించడం జరిగింది.ఎక్సైజ్ సబ్ ఇన్స్పెక్టర్ శంకర్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్క గీత కార్మికుడికి గుర్తింపు కార్డులను మంజూరు చేయడం జరుగుతుందని తెలియజేశారు. ప్రతి గీత కార్మికుడు టిసిఎస్ లైసెన్స్ కార్డులను పొందాలని,టిసిఎస్ గుర్తింపు కార్డు ఉండటం వలన ప్రమాదవశాత్తు తాటి చెట్టు మీద నుంచి పడి మరణించిన లేదా పాక్షిక అంగ వైకల్యం కలిగిన తెలంగాణ ప్రభుత్వం ద్వారా వారికి ఐదు లక్షల ఎక్స్గ్రేషియా వర్తిస్తుందని తెలియజేశారు. సొసైటీ గుర్తింపు కార్డు ఉండటం వలన ప్రభుత్వం నుంచి ఎలాంటి పథకాలు అమలైన గుర్తింపు కార్డులు ఉన్న వారికి ప్రయోజనం కలుగుతుందనిఅన్నారు. గౌడ సంఘం సొసైటీ అధ్యక్షులు బండి లచ్చయ్య మాట్లాడుతూ గౌడ గీత కార్మికులకు టూ వీలర్స్ మరియు ప్రభుత్వం ద్వారా లోన్స్ మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరడం జరిగింది.

ఈ కార్యక్రమం లో ఎక్సైజ్ కానిస్టేబుల్ వేముల శ్రీనివాస్, జి.శ్రీనివాస్,శశికాంత్, గీతా కార్మికులు ఎరుకల సమ్మయ్య గౌడ్, సూద గాని రమేష్,గుర్రం శ్రీనివాస్, గుర్రంఎల్లయ్య, గుర్రం రాములు,రావుల యాకయ్య, రావులసమ్మయ్య,బండి సమ్మయ్య, బండి సుమన్,గుర్రంరాంబాబు గీత కార్మికులు పాల్గొన్నారు.

# ముంబైలో ఆసియా విత్తన కాంగ్రెస్ 2025ను ప్రారంభించిన కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్

న్యూఢిల్లీ, నవంబర్ 18:ముంబైలో ఆసియా విత్తన కాంగ్రెస్ 2025ను నేడు కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమం, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలోనే ఆసియా విత్తన కాంగ్రెస్ 2025 లోగోను కూడా ఆవిష్కరించారు. "నాణ్యమైన విత్తనాల ద్వారా సమృద్ధికి బీజం వేయడం".. ఈ ఏడాది కాంగ్రెస్ ఇతివృత్తం .

దేశ ఆహార భద్రతను కాపాడటం, ప్రజలకు పోషకాహారాన్ని అందించడం, రైతులకు వ్యవసాయం లాభదాయకమైన వ్యాపారంగా ఉండేలా చూడటం ప్రభుత్వ ప్రధాన లక్ష్యాలని ప్రారంభోత్సవ కార్యక్రమంలో కేంద్రమంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు. ప్రతి హెక్టారుకు ఉత్పాదకతను పెంచడం, రైతులకు మంచి విత్తనాలను అందించడం, ఉత్పత్తి వ్యయాలను తగ్గించడంపై ప్రభుత్వం దృష్టి సారించిందని కేంద్రమంత్రి పేర్కొన్నారు. రైతుల ఉత్పత్తులకు న్యాయమైన ధరలు కల్పించడం, అవసరమైనప్పుడు వాటికి పరిహారం ఇవ్వడం, వ్యవసాయ పద్ధతుల వైవిధ్యీకరణపై దృష్టి పెట్టడం వంటి వాటికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిచ్చిందని ఆయన తెలిపారు.

తీవ్రమైన పోషకాహార లోపం సమస్యను అధిగమించడానికి.. వాతావరణ మార్పులను తట్టుకునే బయో-ఫోర్టిఫైడ్ పంట రకాలను అభివృద్ధి చేయడానికి భారత వ్యవసాయ పరిశోధన మండలి (ఐసీఏఆర్), వివిధ రాష్ట్ర సంస్థలు ప్రయత్నాలు చేస్తున్నాయని శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ పేర్కొన్నారు. ఉన్నత నాణ్యత గల విత్తనాల అభివృద్ధికి ప్రభుత్వ రంగ సంస్థలతో పాటు ప్రైవేటు రంగ సహకారం అవసరమని కేంద్రమంత్రి స్పష్టం చేశారు. భారత వ్యవసాయ రంగానికి ప్రైవేటు రంగం నుంచి వచ్చే విత్తనాలు ఖరీదైనవని, మన రైతుల్లో ఎక్కువ మంది ఆర్థికంగా వెనుకబడిన వర్గానికి చెందినవారు కాబట్టి, వారు ఈ విత్తనాలను కొనుగోలు చేయలేరని చెప్పారు. అందుకే తమ విత్తనాల ధరలను మరింత సరసమైనవిగా మార్చాలని ప్రైవేటు రంగానికి విజ్ఞప్తి చేశారు.

ప్రతి సంవత్సరం మార్చాల్సిన అవసరం లేని విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచితే, వ్యవసాయ సమాజానికి ఒక పెద్ద సమస్య పరిష్కార మవుతుందన్నారు. సామర్థ్యం లేని లేదా తక్కువ నాణ్యత గల విత్తనాల సమస్యను సంస్థలు పరిష్కరించాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు.

రైతులందరూ కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వశాఖ ప్రారంభించిన సాథి పోర్టల్‌లోకి లాగిన్ అవ్వాలని, ఇందులో అందుబాటులో ఉన్న సౌకర్యాలను ఉపయోగించుకోవాలని శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ విజ్ఞప్తి చేశారు. వాతావరణ మార్పులకు తట్టుకునే పంటలను అభివృద్ధి చేయడం అత్యవసరమని ఆయన అన్నారు. మన దేశంలో 15 వ్యవసాయ-వాతావరణ మండలాలు ఉన్నాయని, అందువల్ల కరువు, వేడి, పురుగుమందులను తట్టుకోగల రకాలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు.. జీనోమ్ ఎడిటింగ్ అధునిక సాంకేతికతను ఉపయోగించి రెండు రకాల వరిని అభివృద్ధి చేశామని, ఇది తక్కువ నీటి వినియోగంతో ఉత్పాదకతను 19 నుండి 40 శాతం పెంచుతు ందని, కార్బన్ ఉద్గారాలను కూడా తగ్గిస్తుందని ఆయన తెలియజేశారు. విత్తన ఉత్పత్తిదారులతో మాట్లాడుతూ.. తృణ ధాన్యాల రంగంలో మరింత పరిశోధన, అభివృద్ధిపై దృష్టి పెట్టవలసిన అవసరం ఉందని తెలిపారు. తమ సమస్యలను ప్రభుత్వం ముందు ఉంచాలని ప్రైవేటు సంస్థలకు సూచించారు. కొత్త విత్తనాలను మార్కెట్‌కు తీసుకురావడానికి పట్టే సమయాన్ని ఎలా తగ్గించవచ్చో పరిశీలించాలని ఆయన సంస్థలను కోరారు. ఈ విత్తనాలను పరీక్షించడానికి అవసరమైన సమయాన్ని తగ్గించడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తుందని చెప్పారు. విత్తన పరీక్షల ఖర్చు కూడా ఎక్కువగా ఉందని, ఈ విషయంలో ప్రభుత్వం ప్రైవేటు రంగంతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉందని ఆయన పేర్కొన్నారు. విత్తనాల విషయంలో తప్పుడు చర్యలు తీసుకునే వారిని, అక్రమ వ్యాపారం చేసే వారిని ఎప్పటికీ క్షమించబోమని హెచ్చరించారు. అలాంటి వారిని అరికట్టించేందుకు ప్రభుత్వం, ప్రైవేటు రంగం కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

విత్తన రంగంలో వస్తోన్న ఆధునిక మార్పులు, సమస్యలను పరిష్కరించేందుకు ఆసియా విత్తన సమావేశం 2025 అత్యంత కీలకమని భారత జాతీయ విత్తన సంఘం (ఎన్ఎస్ఏఐ) చైర్మన్ శ్రీ ఎన్ ప్రభాకర్ రావు తెలిపారు. భారత విత్తన పరిశ్రమ సమాఖ్య (ఎఫ్ఎస్ఐఐ) చైర్మన్ శ్రీ అజయ్ రాణా, ఆసియా, పసిఫిక్ విత్తన సంఘం (ఏపీఎస్ఈ) అధ్యక్షుడు శ్రీ టేక్ వాహ్‌కో సంయుక్తంగా కాంగ్రెస్‌కు సహ అధ్యక్షత వహిస్తున్నారు.

ప్రభుత్వ విభాగంలో విత్తన రంగానికి చేసిన కృషికి బయోటెక్నాలజీ, జన్యు శాస్త్రవేత్త శ్రీ త్రిలోచన్ మోహపాత్రను ఈ సందర్భంగా సత్కరించారు.

నవంబర్ 17 నుంచి 21 వరకు జరగనున్న ఆసియా విత్తన కాంగ్రెస్ 2025లో అనేక సమాచార కార్యాక్రమాలు నిర్వహించనున్నారు. నేడు కాంగ్రెస్ మొదటి రోజు సమావేశంలో భాగంగా ఒక వర్క్‌షాప్ నిర్వహించారు. నవంబర్ 20, 2025న వార్షిక సర్వసభ్య సమావేశం జరగనుంది.

# జిన్నింగ్ మిల్లులో ఇద్దరు కార్మికులు సజీవదహనం

## మరో ఇద్దరికి గాయాలు

జడ్చర్ల, నవంబర్ 18:జడ్చర్ల మండలంలోని గొల్లపల్లి వద్ద ఉన్న సలసర్ బాలాజీ జిన్నింగ్ మిల్లులో ఈ రోజు జరిగిన భయానక అగ్ని ప్రమాదంలో ఇద్దరు కార్మికులు సజీవ దహనమయ్యారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

జడ్చర్ల మండలం గొల్లపల్లి గ్రామ శివారులోని జిన్నింగ్ మిల్లులో ఒడిశా, బీహార్ రాష్ట్రాలకు చెందిన అనేక మంది కార్మికులు నిత్యం పనిచేస్తుంటారు. బయటికి గాలి చేరే పైపులో చెత్త ఇరుక్కుందని తెలుసుకున్న పప్పు (26) (ఒడిశా), హరేందర్ (23) (బీహార్) రాష్ట్రాలకు చెందిన ఇద్దరు కార్మికులు దానిని తొలగించేందుకు లోపలికి వెళ్లారు. ఇదే సమయంలో సమీపంలో ఉన్న మంటలు ఒక్కసారిగా వారికి తగలడంతో వారు అక్కడికక్కడే అగ్నికి ఆహుతి అయ్యారు.

ఈ ఘటనలో మరో ఇద్దరు కార్మికులుతీవ్రంగా గాయపడ్డారు. వారిని వెంటనే స్థానిక ఆసుపత్రికి తరలించారు. మృతి చెందిన ఇద్దరికీ ఇటీవలే వివాహం జరిగినట్లు తోటి కార్మికులు తెలిపారు. అగ్ని ప్రమాదం అనంతరం బీహార్, ఒడిశా రాష్ట్రాలకు చెందిన కార్మికులు మిల్లు యజమానులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడికక్కడే ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో పోలీసులు అదనపు బలగాలను సంఘటనా స్థలానికి తరలించారు.

# వికలాంగులకు వినికిడి యంత్రాల పంపిణీ




చిత్తూరు, నవంబర్ 18: వికలాంగుల సంక్షేమార్థం వినికిడి యంత్రాల పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ మంగళవారం ప్రారంభించారు. చిత్తూరు నగరంలోని జ్యోతిరావు పూలే బీసీ భవన్‌లో జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆయన, దీన్ దయాళ్ శ్రావణ ఫౌండేషన్, నేషనల్ హెల్త్ మిషన్?ఆర్‌బీఎస్‌కే, ఎన్‌పిపిసిడీ, ఎన్‌సిడీ ఆధ్వర్యంలో వికలాంగులకు వినికిడి యంత్రాలను అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ రేపటి నుండి ఈ నెల 26 వరకు జిల్లా వ్యాప్తంగా మొత్తం 8 ప్రత్యేక క్యాంపులు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ప్రతి వికలాంగుడు ఈ అవకాశాన్ని వినియోగించుకొని ఉచిత పరికరాలు పొందాలని సూచించారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా ట్రైసైకిళ్లు, వీల్‌చైర్లు, వినికిడి యంత్రాలు వంటి పరికరాలను విస్తృతంగా పంపిణీ చేస్తున్నామని చెప్పారు. విభిన్న ప్రతిభావంతులు సమాజంలో ఎవరికి కూడా తగ్గని సామర్థ్యం కలిగినవారని, ప్రభుత్వ పథకాల ద్వారా వారికి ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు చర్యలు కొనసాగుతున్నాయని కలెక్టర్ అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి పరికరాలు అందించే బాధ్యత తనదేనని, అవసరమైన వారు తమ వివరాలను తెలియజేయాలని సూచించారు.

పెన్షన్లు పొందుతున్న దివ్యాంగులలో 95 శాతం వరకు చెవుడు సమస్య ఉన్న వారికి కృత్రిమ వినికిడి యంత్రాలను ఉచితంగా అందించేందుకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు కలిసి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. జిల్లాలోని వికలాంగుల సమస్యలను తెలుసుకుని పరిష్కారం చూపేలా ఈ శిబిరాలు కొనసాగుతాయని అన్నారు. 2018లో ప్రారంభమైన దీన్ దయాళ్ శ్రావణ ఫౌండేషన్ ఇప్పటివరకు 20 వేలమందికి వినికిడి పరికరాలను పంపిణీ చేసినట్లు కలెక్టర్ వివరించారు. ఒక వినికిడి యంత్రం మార్కెట్ విలువ సుమారు 20 నుంచి 25 వేల రూపాయలు ఉంటాయని, ఈ పరికరాలను బామ్లర్ లారీలో అండ్ కంపెనీ లిమిటెడ్ సిఎస్ఆర్ కార్యకలాపాల ద్వారా అందించడం ప్రశంసనీయమని అన్నారు.

అనంతరం పిల్లలకు వినికిడి పరికరాలను స్వయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు ఎమ్మెల్యే చెన్నకేశవులు నాయుడు డి.డి.ఎస్.ఎఫ్ చైర్మన్ రేగుల రామాంజులు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు సి.ఆర్. రాజన్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బి.ఎం. లక్ష్మీనారాయణ, డీఎండ్హెచ్ఓ డా. డి.టి. సుధారాణి, సోషల్ వెల్ఫేర్ జాయింట్ డైరెక్టర్ విక్రమ్ కుమార్ రెడ్డి, తపాన్ సర్కార్, ఏ. భువనచందర్, శ్రీ రామన్, అరుణ్, నవనీత కృష్ణన్, అబ్దాస్ సత్తార్, అధికారులు, వికలాంగులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# బైంసా రహదారిపై ఆందోళన



బాసర నిర్మల్, నవంబర్ 18:: బాసరలో ఓ వర్గానికి చెందిన ఇద్దరు యువకులు చత్రపతి శివాజీ మహారాజ్ శివాజీ మహారాజ్ తల్లి జిజియా బాయి పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఆడియో ఇన్‌స్టాగ్రామ్ లో, సోషల్ మీడియాలో వైరల్ కావడంతో మంగళవారం బాసర గ్రామస్తులు, హిందూ వాహిని సంఘాలు మండిపడ్డాయి.

స్థానిక శివాజీ చౌక్ వద్ద హిందూ వాహిని సంఘ సభ్యులు పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేస్తూ నిజామాబాద్ బైంసాప్రధాన రహదారిపై బైఠాయించారు. హిందువుల మనోభావాల పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఇద్దరు యువకులను కఠినంగా శిక్షించాలని హిందు సంఘాలు డిమాండ్ చేశాయి. సుమారు రెండు గంటలకు పైగా ఆందోళన చేపట్టడంతో ఎక్కడి వాహనలో అక్కడే నిలిచిపోయాయి. విషయం తెలుసుకొన్న అదనపు ఎస్పీ అవినాష్ కుమార్ పోలీసులు భారీగా బాసర చేరుకొని నిజామాబాద్ బైంసారహదారిపై బైఠాయించిన హిందూ సంఘాల ప్రతినిధులను సముదాయించే ప్రయత్నం చేశారు.

ఈ సందర్భంగా హిందు సంఘాల ప్రతినిధులు పోలీసులతో మాట్లాడుతూ అనుచిత వాక్యాలు చేసిన వారి పై పిడీ ఆక్ట్ నమోదు చేసి,కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదనపు ఎస్పీ అవినాష్ కుమార్ మాట్లాడుతూ అనుచిత వ్యాఖ్యలు చేసిన ఒకరిని 30 నిమిషాల్లోనే పోలీసులు అరెస్టు చేసి కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరుస్తామని, మరో యువకుడిని విచారిస్తున్నట్లు అదనపు ఎస్పీ తెలిపారు. హిందూ సంఘాల ఆందోళనను దృష్టిలో పెట్టుకొని బాసరలో భారీగా పోలీసుల బలగలను మోహరించారు. బందోబస్తులో ముధోల్ సిఐ మల్లేష్, ముధోల్, తనూర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# అక్రమంగా దిగుమతి చేసుకున్న 30,000 టపాసులను స్వాధీనం చేసుకున్న డీఆర్ఐ

న్యూఢిల్లీ, నవంబర్ 18:చైనాలో తయారు చేసిన బాణసంచాను మన దేశంలోకి అక్రమంగా దిగుమతి చేసుకొనే యత్నాన్ని రెవెన్యూ ఇంటెలిజెన్స్ డైరెక్టరేట్ (డీఆర్ఐ) విజయవంతంగా అడ్డుకుంది. చట్టవిరుద్ధంగా దిగుమతి చేసుకోవడాన్ని అరికట్టడానికి నిర్వహిస్తున్న "ఫైర్ ట్రయల్" కార్యకలాపాల్లో ఇది ఒక భాగం.

చైనా నుంచి వస్తున్న 40 అడుగుల కంటెయినర్ ను ముంద్రా ఓడరేవులో డీఆర్ఐ అధికారులు అడ్డుకున్నారు. ఆ కంటెయినర్లో నీళ్ల గ్లాసులు, పూల కుండీలు ఉన్నాయని మొదట సమాచారాన్ని ఇచ్చారు. అడుగున 30,000 టపాసులను ఉంచి, పైవరుసలో నీళ్ల గ్లాసులను ఉంచారు. ఇంతకు ముందూ, గత నెలలో ట్యూటికొరిన్, ముంబయిల్లో చైనా టపాసులను చట్టవిరుద్ధంగా దిగుమతి చేసుకోవడానికి చేసిన ప్రయత్నాలను కూడా డీఆర్ఐ విజయవంతంగా అడ్డుకుంది.

విదేశీ వాణిజ్య విధానంలోని ఐటీసీ (హెచ్ఎస్) వర్గీకరణ ప్రకారం టపాసుల దిగుమతిపై నియంత్రణ ఉంది. దీని కోసం పేలుడు పదార్థాల నియమావళి-2008లో భాగంగా విదేశీ వాణిజ్య డైరెక్టర్ జనరల్ (డీజీఎఫ్‌టీ) నుంచీ, పెట్రోలియం, ఎక్స్‌ప్లోజివ్స్ సేఫ్టీ ఆర్గనైజేషన్ (పీఈఎస్ఓ) నుంచీ లైసెన్సు తీసుకోవాల్సి ఉంటుంది. అయితే, దిగుమతిదారు సంస్థ వద్ద ఎలాంటి లైసెన్సులూ లేవు. డబ్బు కోసమే సరుకుల్ని అడ్డదారిలో రవాణా చేసినట్లుగా సంస్థ ఒప్పుకుంది. దీంతో, దిగుమతి చేసుకొన్న

టపాసులనూ, వాటిని రవాణా కోసం ఉపయోగించిన కంటెయినర్, ఇతర సరుకులు సహా కస్టమ్స్ చట్టం-1962 ప్రకారం ఈ నెల 15న స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ.5 కోట్లు ఉంటుందని అంచనా. ఈ లావాదేవీకి సూత్రధారిగా ఉండడమే కాక ఆర్థికసాయాన్నందించిన వ్యక్తిని అరెస్టు చేశారు.

ప్రమాదకరమైన వస్తువులను చట్టవిరుద్ధంగా దిగుమతి చేసుకోవడం- జాతిభద్రతకూ, ప్రజలకూ, కీలక ఓడరేవులకే కాకుండా విస్తృత నౌకాయానానికీ, ఆధునిక వస్తు రవాణా వ్యవస్థకూ కూడా తీవ్ర ముప్పును తెచ్చిపెడుతుంది.

వ్యవస్థీకృత దొంగరవాణా ముఠాలను పసిగట్టి వాటి భరతం పట్టి, ప్రమాదకరమైన వస్తువుల ప్రభావం నుంచి ప్రజలను రక్షించడమే కాకుండా మన దేశ వాణిజ్య, భద్రతా సంబంధిత అనుబంధ విస్తారిత వ్యవస్థ సమగ్రతను పరిరక్షించాలన్న తన కర్తవ్యాన్ని నిర్వహించడానికి డీఆర్ఐ కట్టుబడి ఉంది.

# మహే నౌక చిహ్నాన్ని ఆవిష్కరించిన భారత నౌకాదళం

న్యూఢిల్లీ, నవంబర్ 18: పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన మహే నౌక చిహ్నాన్ని భారత నౌకాదళం ఆవిష్కరించింది. యాంటీ సబ్ మెరెన్ వార్ఫేర్... షాలో వాటర్ క్రాఫ్ట్‌లో ఇది మొదటి యుద్ధ నౌక. దీనిని త్వరలో ముంబయిలో ప్రారంభిచనున్నారు. మాహే నౌక చిహ్నం ఆవిష్కరణ.. భారత నౌకాదళానికి కీలకం. భారతదేశ స్వదేశీ నౌకా నిర్మాణంలో సాధించిన పురోగతిని, నౌక వారసత్వం, రూపకల్పన, కార్యాచరణను కలిపే ప్రత్యేక గుర్తింపును ఇది ప్రతిబింబిస్తుంది.

భారత పశ్చిమ సముద్ర తీరంలోని మాహే తీర పట్టణం పేరు మీదుగా ఈ నౌకకు పేరు పెట్టారు. ఇది దేశ శాశ్వత నౌకా వాణిజ్య వారసత్వాన్ని, తీరప్రాంత స్ఫూర్తిని ప్రతిబింబిస్తుంది.

ఈ ఓడ చిహ్నం... మహే ప్రాంతపు సాంస్కృతిక, యుద్ధ వారసత్వం నుంచి స్ఫూర్తి పొందింది. ఇది 'ఉరుమి' - కలరిపయట్టు యుద్ధకళకు సంబంధించిన వంపు తిరిగిన కత్తి. సముద్రం నుంచి పైకి లేచే కేరళ యుద్ధ వారసత్వానికి ప్రతీక. ఉరుమి చురుకుదనం, ఖచ్చితత్వం, ప్రాణాంతకమైన సౌందర్యానికి ప్రతీక. ఓడ వేగంగా పనిచేయగల, సముద్ర తీరాల్లో సమయోచితంగా దాడి చేయగల సామర్థ్యాన్ని ప్రతిబింబిస్తుంది. చిహ్నంలోని అలలు దేశంలో విస్తారమైన సముద్ర ప్రాంతాన్ని, సరిహద్దులను రక్షించడానికి నావికాదళం ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందనే విషయాన్ని సూచిస్తాయి.

నిశ్శబ్ద వేటగాళ్లు... అన్నది ఈ నౌక లక్ష్యం. ఇది గోప్యత, అప్రమత్తత, అచంచలమైన సంకల్పాన్ని కలిగి ఉంటుంది. ఇవన్నీ యాంటీ-సబ్‌మెరైన్ వార్‌ఫేర్ స్ఫూర్తిని నిర్వచించే లక్షణాలు.

ఈ చిహ్నం దేశ సాంస్కృతిక వారసత్వం, సాంకేతిక సామర్థ్యం కలిసిన సంగమాన్ని సూచిస్తుంది. అలాగే భారత నౌకాదళ స్వదేశీకరణ, ఆవిష్కరణ, ఆత్మనిర్భరతపై ఉన్న నిబద్ధతను స్పష్టంగా తెలుపుతుంది.

# గీతకార్మికుడికి తీవ్ర గాయాలు



యాదాద్రి, నవంబర్ 18: యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొండాపురంలో అదే గ్రామానికి చెందిన బీసు సదయ్య స్థానిక రాముని బండ గుట్ట సమీపంలో ఈ రోజు గీతవృత్తిలో భాగంగా తాటిచెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా ప్రమాదవశాతు ఒక్క సారిగా మోకు జారడంతో అమాంతం తాటిచెట్టు పై నుండి క్రిందపడడంతో సదయ్య కు తీవ్ర గాయాలయ్యాయి.

కాళ్ళు, మోకాళ్ల కు, నడుములకు బలమైన గాయాలయ్యాయి. స్పందించిన స్థానికులు మోత్కూర్ లో ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స నిర్వహించగా, మెరుగైన చికిత్స నిమిత్తం భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. గీతవృత్తిలో తీవ్ర గాయాలైన సదయ్య కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలని గీత సొసైటీ అధ్యక్షుడు బీసు సత్తయ్య, మాజీ అధ్యక్షుడు బుర్ర యాదయ్య, పెద్ద గౌడ్ బీసు వెంకటయ్య లు డిమాండ్ చేశారు.

# ఆకేరు వాగును పరిశీలించిన మైనింగ్ అధికారులు



వరంగల్, నవంబర్ 17: మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలంలోని ఆకేరు వాగు నుండి ఇసుక రవాణా చేస్తున్న ర్యాంపులను మైనింగ్, రెవిన్యూ అధికారులు మంగళవారం పరిశీలించారు. అక్రమ ఇసుక రవాణపై జిల్లా కలెక్టర్ అద్వైత కుమార్ సింగ్ ఆదేశాల మేరకు మంగళవారం అసిస్టెంట్ జియోలజిస్టు శ్రీనివాస్, అసిస్టెంట్ గ్రౌండ్ వాటర్ అధికారి వంశీ, తహశీల్దార్ రమేశ్ బాబు, ఇరిగేషన్ ఏఈ ర్యాంపులను పరిశీలించారు. వాగులో ఇసుక రవాణకు చేసేందుకు అవకాశం లేదని,ఇసుక రవాణా చేస్తే భూగర్భ జలాలు, నీటి లభ్యత లభించే అవకాశాలు లేవని ఈ విషయం జిల్లా కలెక్టరు వివరిస్తామన్నారు.

వాగు పరిశీలనకు వచ్చిన మైనింగ్ అధికారులను రైతులు నిలదీశారు. ఆకేరు వాగు నుండి వందలాది ట్రాక్టర్లు విచ్చల విడిగా రాత్రి పగలు తేడా లేకుండా ఇసుక రవాణా చేస్తుంటే ఎక్కడ ఉన్నరని ఆకేరువాగు పరిశీలినకు వచ్చిన అధికారులను నిలదీశారు. అధికారులు వస్తున్నారనే సమాచారంతో ముందస్తుగా దారులను జేసీబీతో కందకాలు తీశారని, ఆ కందాల పక్క నుండి దారులు వదిలేశారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇంత జరుగుతున్న మంగళవారం రెవెన్యూ సిబ్బంది వాగువద్ద కాపల ఉన్నప్పటికి అక్రమ రవాణా చేయడంపై ప్రజలు, రైతులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

# వదిలేసి భార్య చెంతకు చేరిన ప్రియుడు.. ఇద్దరు పిల్లలతో మహిళ ఆత్మహత్య

న్యూఢిల్లీ, నవంబర్ 18: ప్రియుడు వదిలేసి వెళ్లాడని ఓ మహిళ తన ఇద్దరు పిల్లలతో కలిసి ఆత్మహత్యకు పాల్పడింది. తమిళనాడు రాష్ట్రం కన్యాకుమారి జిల్లాలోని అరుమనై సమీపంలోని పున్నియం ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. పున్నియం ఏరియాకు చెందిన బిందు (34) కు 15 ఏళ్ల క్రితం జయకుమార్‌తో వివాహం జరిగింది. వారికి ఒక కుమారుడు ఉన్నాడు. అనారోగ్యంతో జయకుమార్ మరణించడంతో ఆమె కొన్ని నెలల క్రితం మరుదంపారై ప్రాంతానికి చెందిన వివన్‌ను రెండో వివాహం చేసుకుంది.ఆమెకు వివన్‌తో ఓ కుమార్తె ఉంది. ఈ స్థితిలో అభిప్రాయ భేదాల కారణంగా రెండో భర్త కూడా విడిపోయారు. తరువాత ఆమె తన కొడుకు, కూతురితో కలిసి పున్నియం ప్రాంతంలోని తన తల్లి ఇంటికి వెళ్లింది. అక్కడ బిందుకి పక్కింట్లో నివసించే విజితో వివాహేతర సంబంధం ఏర్పడింది. విజికి భార్య, కాలేజీ చదువుతున్న కొడుకు, కూతురు ఉన్నారు. ఈ విషయం గురించి విజి భార్యకు తెలియడంతో అభ్యంతరం చెప్పింది.దాంతో విజి రెండు నెలల క్రితం బిందు, ఆమె ఇద్దరు పిల్లల (5వ తరగతి చదువుతున్న కొడుకు, ఎల్‌కేజీ చదువుతున్న కూతురు) తో కలిసి బిలాంగ్‌తోట్టవిలైకి వెళ్లి ఆర్‌సీ చర్చిరోడ్డులో ఓ గది అద్దెకు తీసుకుని ఉంటున్నాడు.

# పోలీస్ వాహనంలో తరలింపు

సదాశివనగర్, నవంబర్ 17: సదాశివనగర్ మండలంలోని కుప్రియాల్ గ్రామ శివారులో ఈ రోజు 44వ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికీ గాయాలైనట్లు ఎస్సై పుష్పరాజ్ తెలిపారు. మండలంలోని భూంపల్లి గ్రామానికి చెందిన కమ్మరి నవీన్ కమ్మరి సౌందర్య ద్విచక్ర వాహనంపై వస్తుండగా ప్రమాదవశాత్తు వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో ఇద్దరికీ గాయాలయ్యాయి.

సమాచారం అందుకున్న పోలీస్ సిబ్బంది వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని తమ సొంత పెట్రోలింగ్ కారులో ప్రథమ చికిత్స కోసం కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఇద్దరి పరిస్థితి స్థిరంగా ఉన్నట్టు తెలిపారు.

సమాచారం అందు కున్న వెంటనే ఎస్సై పుష్పరాజ్, పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి గాయాలైన వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడంతో తక్షణవే వైద్య సహాయం అందించగలిగామని వైద్యులు తెలిపారు.

# ఢిల్లీ బాంబు పేలుడుకు పాల్పడిన దోషులు పాతాళంలో ఉన్నా వెలికితీస్తాం: హోం మంత్రి

న్యూఢిల్లీ, నవంబర్ 18: ఇవాళ హర్యానాలోని ఫరీదాబాద్‌లో జరిగిన 32వ ఉత్తర ప్రాంతీయ మండలి (ఎన్‌జెడ్‌సీ) సమావేశానికి కేంద్ర హోం, సహకార శాఖల మంత్రి శ్రీ అమిత్ షా అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో హర్యానా ముఖ్యమంత్రి శ్రీ నాయబ్ సింగ్ సైనీ, పంజాబ్ ముఖ్యమంత్రి శ్రీ భగవంత్ మాన్, హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ సుఖ్వీందర్ సింగ్ సుఖు, రాజస్థాన్ ముఖ్యమంత్రి శ్రీ భజన్ లాల్ శర్మ, జమ్మూ కాశ్మీర్ ముఖ్యమంత్రి శ్రీ ఒమర్ అబ్దుల్లా, ఢిల్లీ ముఖ్యమంత్రి శ్రీమతి రేఖా గుప్తా పాల్గొన్నారు. వీరితో పాటు కేంద్రపాలిత ప్రాంతం చండీగఢ్ అడ్మినిస్ట్రేటర్ శ్రీ గులాబ్ చంద్ కటారియా, జమ్మూ కాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ శ్రీ మనోజ్ సిన్హా, ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ శ్రీ వినయ్ కుమార్ సక్సేనా, లడఖ్ లెఫ్టినెంట్ గవర్నర్ శ్రీ కవీందర్ గుప్తా కూడా హాజరయ్యారు. ఆయా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన సీనియర్ మంత్రులు, కేంద్ర హోం కార్యదర్శి, అంతర్రాష్ట్ర మండలి కార్యదర్శి, సభ్య రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు- సలహాదారులు.. రాష్ట్ర ప్రభుత్వాలు, వివిధ కేంద్ర మంత్రిత్వ శాఖలు- విభాగాల సీనియర్ అధికారులు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు.

ఢిల్లీలో ఇటీవల జరిగిన కారు బాంబు పేలుడు, జమ్మూ కాశ్మీర్‌లోని నౌగామ్ పోలీస్ స్టేషన్‌లో జరిగిన పేలుడులో ప్రాణాలు కోల్పోయిన వారికి సమావేశం ప్రారంభంలో రెండు నిమిషాల పాటు మౌనం పాటించి నివాళులర్పించారు. కేంద్ర హోం శాఖ మంత్రి మాట్లాడుతూ.. ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో ఉగ్రవాదాన్ని మూలాల నుంచి నిర్మూలించేందుకు సామూహిక నిబద్ధతతో ఉండాలని స్పష్టం చేశారు. మోదీ ప్రభుత్వానికి ఉన్న గత ట్రాక్ రికార్డు ప్రకారమే ఈ సారి కూడా ఢిల్లీ బాంబు పేలుడుకు పాల్పడిన దోషులు పాతాళంలో ఉన్నా వెలికితీసి దేశ న్యాయ వ్యవస్థ ముందు నిలబెట్టి, సాధ్యమైనంత కఠినమైన శిక్ష పడేలా చూస్తామని ఆయన పేర్కొన్నారు.

బలమైన రాష్ట్రాల ద్వారానే బలమైన దేశం ఏర్పడుతుందని, దీనిని వాస్తవ రూపంలోకి తీసుకురావటంలో ప్రాంతీయ మండళ్లు కీలక పాత్ర పోషిస్తాయన్నది ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దార్శనికతని హోం మంత్రి అన్నారు. చర్చలు, సహకారం, సమన్వయం, విధాన సమన్వయానికి ప్రాంతీయ మండళ్లు అత్యంత ముఖ్యమైనవి పేర్కొన్న ఆయన.. వీటి ద్వారా అనేక రకాల సమస్యలు పరిష్కారమయ్యాయని తెలిపారు. మహిళలు- పిల్లలపై జరిగే నేరాల విషయంలో వేగంగా న్యాయాన్ని అందించేందుకు, అలాగే పోషకాహార లోపం- పిల్లలు తగినంత ఎత్తు పెరగకపోవడం వంటి సమస్యలను పూర్తిగా నిర్మూలించేందుకు బహుముఖంగా ప్రయత్నాలను కొనసాగించాలని ఆయన ఉద్ఘాటించారు. మహిళలు, పిల్లలపై జరిగే లైంగిక నేరాలు, అత్యాచారాల కేసులను పోక్సో చట్టం కింద వేగంగా దర్యాప్తు చేయటాన్ని ప్రధానంగా ప్రస్తావించిన శ్రీ అమిత్ షా.. ఇటువంటి హేయమైన నేరాలను ఏ నాగరిక సమాజం అంగీకరించదని అన్నారు. మహిళలు, పిల్లల భద్రత తమకు అగ్ర ప్రాధాన్యతగా ఉందని తెలియజేసిన ఆయన.. దీనికోసం ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ కోర్టుల (ఎఫ్‌టీఎస్‌సీ) సంఖ్యను పెంచాలని సూచించారు.

పేదరికాన్ని నిర్మూలించేందుకు, ఉపాధిని కల్పించేందుకు సహకారం, వ్యవసాయం, మత్స్య సంపద రంగాలు ముఖ్యమైన సాధనాలుగా మారగలవని కేంద్ర హోం, సహకార శాఖల మంత్రి అన్నారు. సహకారం, వ్యవసాయం, మత్స్య సంపద ద్వారా పేదరిక నిర్మూలన, ఉపాధి అవకాశాల పెరుగుదల జరుగుతోందని ఆయన పేర్కొన్నారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ మంత్రమైన 'సహకార్ సే సమృద్ధి'ని (సహకారం ద్వారా సమృద్ధి) ప్రస్తావించిన ఆయన.. ఉపాధి కల్పించే విషయంలో సహకార రంగానికి అపారమైన సామర్థ్యం ఉందని అన్నారు. స్థూల దేశీయోత్పత్తితో (జీడీపీ) పాటు ఉపాధిని.. ముఖ్యంగా స్వయం ఉపాధిని పెంచటం ద్వారా మాత్రమే మనం అభివృద్ధి చెందిన భారతదేశం అనే కలను సాకారం చేసుకోగలమని అన్నారు. ఒక దేశ సమృద్ధికి జీడీపీ మాత్రమే సూచిక కాదన్న ఆయన.. ప్రతి ఒక్కరూ పేదరిక రేఖకు దాటినప్పుడే నిజమైన సమృద్ధి ఉంటుందని స్పష్టం చేశారు. సహకార రంగాన్ని బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వంలోని సహకార మంత్రిత్వ శాఖ దేశ వ్యాప్తంగా 57 రకాల పనులు, కార్యక్రమాలను ప్రారంభించిందని ఆయన తెలిపారు. వీటిలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల (ప్యాక్స్) కంప్యూటరీకరణ, మూడు కొత్త జాతీయ స్థాయి సహకార సంఘాల ఏర్పాటు, త్రిభువన్ సహకారి విశ్వవిద్యాలయం ఏర్పాటు వంటివి ఉన్నాయన్నారు.

వాస్తవానికి ప్రాంతీయ మండలి పాత్ర సలహాలు ఇవ్వటమే అయినా గత దశాబ్దంలో ఇవి కార్యాచరణ-ఆధారిత వేదికలుగా మారాయన్న శ్రీ అమిత్ షా.. ఇది ఫలితాలను కూడా అందించిందని తెలిపారు. సమస్యలను అనుసరించటం ద్వారా రాష్ట్రాల మధ్య, ప్రాంతాలు- రాష్ట్రాల మధ్య, కేంద్ర- రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఉన్న సమస్యలను అంగీకరించటమే కాకుండా.. వాటిని పరిష్కరించేందుకు నిర్దిష్ట మార్గాలను కూడా రూపొందించినట్లు ఆయన తెలిపారు. జాతీయ పురోగతితో పాటు ప్రాంతీయ సామర్థ్యాన్ని సాధించటం, ప్రతి రంగంలో భారత్ ప్రపంచ నాయకత్వ స్థానాన్ని పొందటం అనేవి మనకున్న స్పష్టమైన లక్ష్యాలని తెలియజేసిన ఆయన.. ఇవి మనల్ని గొప్ప భారత్ నిర్మాణం దిశగా నడిపిస్తాయని పేర్కొన్నారు. జల వనరుల నిర్వహణ, నీటికి సంబంధించిన సమస్యలను పరిష్కరించుకునేందుకు అన్ని రాష్ట్రాలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని హోం మంత్రి కోరారు.

2004-2014 కాలంతో పోలిస్తే 2014 నుంచి 2025 వరకు ప్రాంతీయ మండళ్ల సమావేశాల సంఖ్య దాదాపు రెండున్నర రెట్లు పెరిగిందని, ఈ సమావేశాలను అర్థవంతంగా నిర్వహించినట్లు శ్రీ అమిత్ షా పేర్కొన్నారు. 2004- 2014 మధ్య ప్రాంతీయ మండళ్లు, స్టాండింగ్ కమిటీల సమావేశాలు 25 మాత్రమే జరిగాయన్న ఆయన.. 2014 నుంచి 2025 లో ఇప్పటివరకు 64 సమావేశాలు నిర్వహించినట్లు తెలిపారు. సమావేశాల సంఖ్య రెట్టింపు అవటం అనేది ప్రధానమంత్రి మోదీ 'టీం భారత్' భావనను తెలియజేస్తోందని అన్నారు. ఈ సమావేశాలలో 1600 సమస్యలను చర్చించగా 1303 సమస్యలు (81.43 శాతం) పరిష్కరమైనట్లు తెలిపారు. అంతర్రాష్ట్ర మండలి కార్యాలయం చురుకైన పాత్ర పోషించడంతో పాటు.. అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్రపాలిత ప్రాంతాలు, కేంద్ర మంత్రిత్వ శాఖలు- విభాగాల సహకారం వల్ల ఇది సాధ్యమైందని ఆయన పేర్కొన్నారు.

వందేమాతర గేయం 150వ వార్షికోత్సవాన్ని అని గుర్తు చేసిన హోం మంత్రి.. శ్రీ బంకిం చంద్ర చటర్జీ గారి ఈ గొప్ప రచన మన దేశ స్వాతంత్ర్యం కోసం ఒక నినాదంగా మారిందని పేర్కొన్నారు. గొప్ప భారతదేశాన్ని నిర్మించేందుకు మరోసారి దీనిని నినాదంగా మార్చేందుకు అన్ని రాష్ట్రాలతో కలిసి కేంద్ర ప్రభుత్వం పని చేస్తోందని ఆయన అన్నారు. భారత యువజనుల్లో దేశభక్తి విలువలను నింపేందుకు ఇదొక ప్రయత్నమన్న ఆయన.. వందేమాతర గేయం ద్వారా దేశ యువతలో దేశభక్తి స్ఫూర్తిని రగిలించాలని అమిత్ షా అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు విజ్ఞప్తి చేశారు.

మూడు కొత్త క్రిమినల్ చట్టాల గురించి మాట్లాడిన కేంద్ర హోం మంత్రి.. వీటి అమలు చాలా సానుకూల ఫలితాలను ఇచ్చిందని తెలిపారు. కొత్త చట్టాల ప్రకారం శిక్షల రేటు దాదాపు 25 నుంచి 40 శాతం వరకు పెరిగిందని, దోషులకు సకాలంలో శిక్ష పడుతోందని చెప్పారు. ఈ చట్టాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వాలు మరింత కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. దర్యాప్తు, ఫోరెన్సిక్ విశ్లేషణ నుంచి మొదలుకొని కోర్టులను ఆన్‌లైన్‌లో అనుసంధానించే వరకు సాంకేతికతను మెరుగుపరచాలని రాష్ట్రాలన్నింటికి హోం మంత్రి సూచించారు.

చిరుధాన్యాలను ప్రోత్సహించే విషయంలో రాజస్థాన్ చేసిన కృషిని శ్రీ అమిత్ షా అభినందించారు. అన్ని రాష్ట్రాలు చిరుధాన్యాల ఉత్పత్తి, వినియోగాన్ని పెంచాలని ఆయన కోరారు. ప్రతి నెల పేదలకు 5 కిలోల ఉచిత ఆహార ధాన్యాలను అందించే పథకంలో చిరుధాన్యాలను కూడా చేర్చాలని రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. దీనివల్ల చిరుధాన్యాల ఉత్పత్తి పెరుగుతుందని, కొత్త తరానికి చిరుధాన్యాలు తినే అలవాటు అవుతుందని, ప్రజల ఆరోగ్యం కూడా మెరుగుపడుతుందని ఆయన అన్నారు.

ఈ సమావేశంలో సభ్య రాష్ట్రాల సమస్యలతో పాటు అనేక ముఖ్యమైన జాతీయ సమస్యలను కూడా చర్చించారు. మహిళలు, పిల్లలపై జరిగే అత్యాచార కేసుల త్వరిత దర్యాప్తు, సత్వర పరిష్కారం కోసం ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ కోర్టుల (ఎఫ్‌టీఎస్‌సీ) ఏర్పాటు వీటిలో ఉంది. దీనితో పాటు ప్రతి గ్రామానికి నిర్ణీత భౌగోళిక పరిధిలో భౌతిక బ్యాంకింగ్ సేవలు అందుబాటులోకి తీసుకురావటం.. జల వనరుల పంపిణీ, పర్యావరణం, ఉన్నత విద్య వంటి ముఖ్యమైన అంశాలు.. అత్యవసర స్పందన సహాయ వ్యవస్థ (ఎమర్జెన్సీ రెస్పాన్స్ సపోర్ట్ సిస్టమ్- ఈఆర్‌ఎస్‌ఎస్- 112).. ప్రాంతీయ స్థాయిలో ఉమ్మడి ఆసక్తి కలిగిన ఇతర అంశాలపై చర్చించారు.

వీటితో పాటు ఎజెండాలో ఆరు అత్యంత ముఖ్యమైన జాతీయ అంశాలు కూడా ఉన్నాయి. అవి- పట్టణ మాస్టర్ ప్లానింగ్, విద్యుత్ సరఫరా వ్యవస్థ, ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలను (ప్యాక్స్) బలోపేతం చేయడం, 'పోషణ్ అభియాన్' ద్వారా పిల్లల్లో పోషకాహార లోపాన్ని నిర్మూలించడం, పాఠశాల చదువులను ఆపేసే వారి శాతాన్ని తగ్గించడం, ఆయుష్మాన్ భారత్-ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజనలో ప్రభుత్వ ఆసుపత్రుల భాగస్వామ్యం.

సూరజ్‌కుండ్ కేవలం చారిత్రక ప్రాంతమే కాదని.. ఇదొక సుసంపన్నమైన సాంస్కృతిక- కళాత్మక వారసత్వం, ఆర్థిక చైతన్యానికి సజీవ సాక్ష్యమని శ్రీ అమిత్ షా అన్నారు. సూరజ్‌కుండ్ నేల, సూర్య నారాయణుడు చేసిన భగీరథ ప్రయత్నాలు మనకు స్ఫూర్తినిస్తాయని ఆయన పేర్కొన్నారు. సాక్షాత్తు శ్రీ కృష్ణుడే దివ్యమైన నోటితో మొట్టమొదటగా భగవద్గీతను ఇక్కడ ఉపదేశించారని.. సింధు లోయ ప్రాచీన నాగరికతకు సంబంధించిన ఆధారాలు కూడా ఇక్కడ లభించాయని ఆయన అన్నారు. గొప్ప సిక్కు గురువుల భూమి హర్యానా, పంజాబ్‌లని అన్న ఆయన.. సిక్కు గురువులు దేశంలో కేవలం ఆధ్యాత్మిక చైతన్యాన్ని బలోపేతం చేయటమే కాకుండా దేశ గౌరవం- స్వాతంత్ర్యం కోసం అపారమైన త్యాగాలు కూడా చేశారని అన్నారు. గురు తేగ్ బహదూర్ లేకపోయి ఉంటే ఇవాళ దేశం మౌలికమైన సంప్రదాయాల ఆధారంగా ముందుకు సాగి ఉండేది కాదని అమిష్ షా పేర్కొన్నారు. గురు తేగ్ బహదూర్ చేసిన గొప్ప త్యాగం, పదో గురువు చేసిన త్యాగం దేశానికి గొప్ప బలాన్ని ఇచ్చి, పోరాట మార్గాన్ని చూపాయని ఆయన అన్నారు.

## ఒత్తిడి, ఆందోళన అధికంగా ఉండడం కారణంగానే చాలా మంది తలనొప్పి

హైదరాబాద్ నవంబర్ 18 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); );తలనొప్పి అనేది సహజంగానే చాలా మందికి తరచూ వస్తుంటుంది. ఇందుకు అనేక కారణాలు ఉంటాయి. ఒత్తిడి, ఆందోళన అధికంగా ఉండడం కారణంగానే చాలా మంది తలనొప్పి బారిన పడుతుంటారు. అయితే కొన్ని సార్లు తలనొప్పి ఒక పట్టాన తగ్గదు. రోజుల



దీర్ఘకాలంగా ఒత్తిడి ఉంటే అది మైగ్రేన్‌గా మారుతుంది. నిద్ర సరిగ్గా లేకపోవడం, నిద్రపోవడంలో మార్పులు చోటు చేసుకోవడం, వాసనలను ముక్కు సరిగ్గా పసిగట్టలేకపోవడం, వాతావరణంలో వచ్చే మార్పుల వల్ల కూడా మైగ్రేన్ వస్తుంది. అయితే స్త్రీలకు ఇది రుతు

తరబడి అలాగే ఉంటుంది. పైగా తలను ఎవరో బలమైన వస్తువుతో కొడుతున్నట్లు అనిపిస్తుంది. తల చుట్టూ విపరీతమైన నొప్పిగా ఉంటుంది. ఇది కొన్ని రోజులు లేదా వారాల తరబడి అలాగే ఉంటుంది. దీన్నే మైగ్రేన్ అంటారు. తలనొప్పికి, మైగ్రేన్‌కు దగ్గరి పోలిక ఉన్నా వాస్తవానికి ఇవి రెండూ భిన్న రకాల అనారోగ్య సమస్యలు. తలనొప్పి వచ్చేందుకు, మైగ్రేన్ వచ్చేందుకు భిన్న రకాల కారణాలు ఉంటాయి. మైగ్రేన్‌ను నాడీ సంబంధ సమస్యగా చెప్పవచ్చు. కనుక మైగ్రేన్‌లో భాగంగా వచ్చే తలనొప్పి మరీ తీవ్రంగా ఉంటుంది. కొన్ని సార్లు ఈ నొప్పిని అసలు భరించలేకపోతారు.

ఎందుకు వస్తుంది..?

మెదడుకు అనుసంధానం అయి ఉండే నాడులు లేదా రక్త నాళాలు వాపులకు గురైనప్పుడు నొప్పి వస్తుంది. దీన్నే మైగ్రేన్ గా చెబుతారు. కొందరికి రోజుల తరబడి సాధారణ తలనొప్పి ఉండి అది మైగ్రేన్ గా మారేందుకు కూడా అవకాశాలు ఉంటాయి. సమయంలో వచ్చే అవకాశాలు ఉంటాయి. లేదా వారిలో హార్మోన్లలో మరీ తీవ్రమైన హెచ్చు తగ్గులు ఉన్నా కూడా మైగ్రేన్ సమస్య వస్తుంది. ఇది వచ్చిన వారు డాక్టర్ల సలహా మేరకు చికిత్స తీసుకోవాల్సి ఉంటుంది. వారు ఇచ్చే మందులను క్రమం తప్పకుండా వాడాలి. అలాగే పలు ఆహారాలను తీసుకుంటున్నా కూడా మైగ్రేన్ నుంచి బయట పడవచ్చు. తలనొప్పి తగ్గుతుంది.

మైగ్రేన్ ఉన్నవారు యాంటీ ఇన్ ఫ్లామేటరీ ఆహారాలు లేదా ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు ఉండే ఆహారాలను తింటుండాలి. అవిసె గింజలు, వాల్ నట్స్‌లో ఈ రెండు స్వభావాలను కలిగి ఉంటాయి. కనుక వీటిని రోజూ గుప్పెడు మోతాదులో తింటుంటే ఉపయోగం ఉంటుంది. వీటిని నీటిలో నానబెట్టి తినాల్సి ఉంటుంది. దీని వల్ల వాపులు తగ్గిపోతాయి. మైగ్రేన్ నుంచి ఉపశమనం లభిస్తుంది. అలాగే పసుపు, అల్లం కూడా మనకు మేలు చేస్తాయి. వీటిల్లో సహజసిద్ధమైన యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. అందువల్ల వీటిని తీసుకుంటే శరీరంలో అంతర్గతంగా ఉండే వాపులు తగ్గుతాయి.

## ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

శ్రీకాకుళం, నవంబర్ 18: మండలంలోని లంకాం గ్రామంలో సచివాలయం పరిధిలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళ వారం శ్రీకాకుళం శాసనసభ్యులు గోండు శంకర్ ప్రారంభించారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని నిర్వాహకులకు ఎమ్మెల్యే తెలిపారు.

రైతుల ధాన్యాన్ని లారీలకు ఎత్తిన తర్వాత వారికి ఎలాంటి సంబంధం ఉండదని ఎలాంటి సమస్యలున్నా నిర్వాహకులు, అధికారులు చూసుకోవాలని ఎమ్మెల్యే అన్నారు.

కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బం దులు లేకుండా మౌలిక సదుపా యాలు కల్పించాలని ఎమ్మెల్యే సూచించారు.

రైతులందరూ తమ ధాన్యాన్ని దళారులకు కాకుండా, కొనుగోలు కేంద్రాల్లోనే క్రయవిక్రయాలు జరపాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

## జ్యూట్ బ్యాగ్ తయారీ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మం, నవంబర్ 18:ఎం.ఎస్.ఎం. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ వారి ఆధ్వర్యంలో సింగరేణి సేవా సమితి ద్వారా జ్యూట్ బ్యాగ్ తయారీలో శిక్షణ ఇచ్చేందుకు స్థానిక నిరుద్యోగ మహిళల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శాలెం రాజు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. శిక్షణ 45 రోజుల పాటు కొనసాగనున్నట్లు వెల్లడించారు. అర్హత, ఆసక్తి కలిగిన జికెఓసీ/ వికె కోల్ మైన్స్ పరిసర ప్రభావిత గ్రామాల నిరుద్యోగ మహిళలు ఈ నెల 30వ తేదీ లోపు దరఖాస్తులను కొత్తగూడెం ఏరియాలోని పర్సనల్ డిపార్ట్‌మెంట్ నందు సమర్పించాలని తెలిపారు. దరఖాస్తుతో పాటు విద్యార్హత సర్టిఫికెట్స్, ఆధార్ కార్డు జిరాక్స్, మూడు పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలు జత చేయాలని పేర్కొన్నారు.

## అమెరికాతో మొదటి ప్రధాన ఎల్పీజీ దిగుమతి ఒప్పందాన్ని కుదుర్చుకున్న భారత్

న్యూఢిల్లీ, నవంబర్ 18: యూఎస్ గల్ఫ్ కోస్ట్ నుంచి 2026 సంవత్సరానికి 2.2 మిలియన్ టన్నుల ఎల్పీజీని దిగుమతి చేసుకొనేందుకు భారతీయ పీఎస్‌యూ సంస్థలు ఏడాది కాల వ్యవధి ఉన్న ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయని పెట్రోలియం, సహజవాయు మంత్రి శ్రీ హర్దీప్ సింగ్ పూరీ ఈ రోజు ప్రకటించారు. ఇది భారతీయ వార్షిక ఎల్పీజీ దిగుమతుల్లో పది శాతానికి చేరువలో ఉంది. ఇది భారతీయ మార్కెట్ కోసం కుదుర్చుకున్న మొదటి నిర్మాణాత్మక యూఎస్ ఎల్పీజీ ఒప్పందం. ఈ నిర్ణయాన్ని చరిత్రాత్మక ఘట్టంగా అభివర్ణించిన మంత్రి.. ప్రపంచంలోనే అతి పెద్దదైన, వేగంగా అభివృద్ధి చెందుతున్న ఎల్పీజీ మార్కెట్... అమెరికాకు అందుబాటులోకి వచ్చినట్లయిం దన్నారు.

వైవిధ్యమైన వనరులను ఎంపిక చేసుకోవడం ద్వారా నమ్మకమైన, సరసమైన ధరకు ఎల్పీజీని అందించడానికి భారత్ కృషి చేస్తోందని మంత్రి అన్నారు. ఈ ప్రయత్నంలో భాగంగా.. ఇండియన్ ఆయిల్, భారత్ పెట్రోలియం కార్పొరేషన్ (బీపీసీఎల్), హిందూస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ (హెచ్‌పీసీఎల్) అధికారుల బృందం 2025 జులై 21 నుంచి 24 వరకు అమెరికాను సందర్శించి, అక్కడి ప్రధాన ఉత్పత్తిదారులతో చర్చించింది. మౌంట్ బెల్వియూ ప్రామాణికంగా ఎల్పీజీ కొనుగోలు ఒప్పందం కుదుర్చుకోవడం ద్వారా చర్చలు విజయవంతంగా ముగిశాయి.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రపంచంలో అందరికంటే తక్కువ ధరకు, దేశ వ్యాప్తంగా అందరికీ ఎల్పీజీని చమురు రంగంలోని పీఎస్‌యూ సంస్థలు అందించాయని శ్రీ పూరి అన్నారు. గతేడాది ప్రపంచ వ్యాప్తంగా ఎల్పీజీ ధరలు 60 శాతానికి పైగా పెరిగినా, వాస్తవంగా సిలిండర్ ధర రూ.1100 దాటినా, ఉజ్వల లబ్ధి దారులకు రూ.500 - 550 రాయితీ ధరలకే సిలిండర్లను అందించారు. అంతర్జాతీయంగా పెరుగుతున్న ఎల్పీజీ ధరల ప్రభావం.. కుటుంబాలపై ముఖ్యంగా తలులపై, అక్కాచెల్లెళ్లపై పడకుండా రూ.40,000 కోట్లకు పైగా అదనపు భారాన్ని ప్రభుత్వమే భరించింది.

భారత ఇంధన భద్రతను బలోపేతం చేయడం లోనూ, లక్షలాది గృహాలకు స్వచ్ఛ వంట ఇంధనాన్ని చౌకగా అందించడంలోనూ 2026 ఏడాదికి కుదుర్చుకున్న ఈ ఒప్పందం మరో విజయమని మంత్రి స్పష్టం చేశారు.

## టోక్యో ఇండస్ట్రీ మీట్‌లో ఇండో-జపనీస్ ఇంధన అవకాశాలను స్పష్టం చేసిన కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పురీ

న్యూఢిల్లీ, నవంబర్ 18:కేంద్ర పెట్రోలియం, సహజవాయువు శాఖ మంత్రి శ్రీ హర్దీప్ సింగ్ పురీ ఈ రోజు టోక్యోలో జపాన్ పరిశ్రమ ప్రతినిధులతో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్నారు. మొత్తం ఇంధన వాణిజ్య కార్యకలాపాల్లో ఇండో-జపాన్ సహకారం కోసం గల అవకాశాలపై ప్రధానంగా చర్చించారు. ఇండో-పసిఫిక్ ప్రాంతంలోని రెండు ప్రధాన ఆర్థిక వ్యవస్థలైన భారత్, జపాన్ దేశాలు సురక్షితమైన, సుస్థిరమైన, భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న ఇంధన వ్యవస్థల నిర్మాణం కోసం కలిసి పనిచేయగల అవకాశాలనూ వారు చర్చించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో మెరుగైన భారత్ స్థాయి, పెరుగుతున్న ఇంధన డిమాండ్, అపూర్వ మౌలిక సదుపాయాల విస్తరణకు జపాన్ సాంకేతిక నైపుణ్యం తోడైతే ఈ ప్రాంత దీర్ఘకాలిక ఇంధన సుస్థిరత కోసం సహజ భాగస్వామ్యాన్ని సృష్టించవచ్చని శ్రీ పురీ వ్యాఖ్యానించారు.

ఈ ఏడాది ఆగస్టులో ప్రధానమంత్రి శ్రీ మోదీ జపాన్ పర్యటన సందర్భంగా ఇరు దేశాలు తదుపరి దశాబ్దానికి భారత్-జపాన్ ఉమ్మడి దార్శనికతను ఆమోదించాయని ఈ చర్చ సందర్భంగా కేంద్ర మంత్రి పేర్కొన్నారు. 2022?2026 కాలంలో జపాన్ నుంచి భారతదేశానికి వచ్చిన 5 ట్రిలియన్ జేపీవై ప్రభుత్వ, ప్రైవేటు పెట్టుబడులతో గణనీయ లక్ష్యాన్ని సాధించిన క్రమంలో... సమీప భవిష్యత్తులో 10 ట్రిలియన్ జేపీవై (68 బిలియన్ల అమెరికన్ డాలర్ల) ప్రైవేట్ రంగ పెట్టుబడులను సాధించాలనే సరికొత్త లక్ష్యాన్ని నిర్దేశించుకున్నామన్నారు. ఈ విజయం ప్రత్యేకించి పరిశుద్ధ ఇంధనం, అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞాన రంగాల్లో ఇరు దేశాల మధ్య పెరుగుతున్న వ్యూహాత్మక సమన్వయాన్ని స్పష్టం చేస్తుంది... ఈ భాగస్వామ్యం ద్వారా ఆచరణాత్మక, పరివర్తనాత్మక ఫలితాలు సాధించడం పట్ల ప్రధానమంత్రి నిబద్ధతను ఇది ప్రతిబింబిస్తుంది అని కేంద్ర మంత్రి తెలిపారు.

అన్వేషణ, ఉత్పత్తి, ఎన్ఎన్‌జీ, నగర గ్యాస్ పంపిణీ, హైడ్రోజన్, షిప్పింగ్, నూతన ఇంధనాల్లో భారత్ 500 బిలియన్ డాలర్లకు పైగా పెట్టుబడి అవకాశాలను కల్పిస్తోందని కేంద్ర మంత్రి పురీ స్పష్టం చేశారు. అత్యధిక యువ శ్రామిక శక్తి, బలమైన సంస్కరణ-ఆధారిత వ్యాపార వాతావరణం, ప్రపంచం కోసం మేక్ ఇన్ ఇండియా స్ఫూర్తితో భారత్ జపాన్ పెట్టుబడిదారుల కోసం అపారమైన సామర్థ్యాన్ని అందిస్తుంది. అత్యాధునిక సాంకేతికత, అధునాతన పారిశ్రామిక వ్యవస్థలు, అధిక-నాణ్యత గల మౌలిక సదుపాయాల నైపుణ్యం, గ్రీన్-పర్యావరణ సాంకేతికతల్లో ప్రపంచస్థాయి నాయకత్వాన్ని అందిస్తూ జపాన్ ఇరుదేశాల భాగస్వామ్యాన్ని పరిపూర్ణం చేస్తోంది.

ఇంధన రంగాల్లో 100 శాతం ఎఫ్‌డీఐ, పారదర్శక బిడ్డింగ్, ఏడాది పొడవునా అన్వేషణ లైసెన్సింగ్ ద్వారా భారత్ విధానంలో పూర్తిగా మార్పు వచ్చిందన్న కేంద్ర మంత్రి... అంచనా వేయగల, పెట్టుబడిదారులకు అనుకూలమైన వాతావరణాన్ని ఇది సృష్టించిందని స్పష్టం చేశారు. దేశంలోని ఆరు ప్రధాన చమురు, గ్యాస్ పీఎస్‌యూలు 2024?25 ఆర్థిక సంవత్సరంలో సుమారు 315 బిలియన్ డాలర్ల ఆదాయాన్ని నమోదు చేశాయనీ, ఇది భారత జీడీపీలో దాదాపు 8 శాతం వాటాకు సమానమని కేంద్ర మంత్రి శ్రీ పురీ పేర్కొన్నారు. ఈ స్థాయి... ప్రపంచ ఇంధన రంగంలో భారత్ స్థానాన్ని మరింత పటిష్ఠం చేయడంతో పాటు జపనీస్ కంపెనీలకు నమ్మకమైన దీర్ఘకాలిక భాగస్వామిగా భారత్‌ను నిలిపిందని ఆయన అన్నారు.

ప్రస్తుతం ప్రపంచంలోనే మూడో అతిపెద్ద చమురు వినియోగదారుగా ఉన్న భారత్... రాబోయే రెండు దశాబ్దాల్లో పెరుగుతున్న ప్రపంచ ఇంధన డిమాండ్‌లో దాదాపు 30 శాతం వాటాను కలిగి ఉంటుందని కేంద్ర మంత్రి అన్నారు. సుమారు 72 బిలియన్ డాలర్ల పెట్టుబడి వ్యయంతో విస్తరిస్తున్న భారత సహజవాయువు మౌలిక సదుపాయాలు... జపాన్ సాంకేతిక బలంతో సహోత్తేజానికి, ముఖ్యంగా హైడ్రోజన్ వంటి భవిష్యత్ ఇంధన పరిష్కారాలతో గ్యాస్‌ను అనుసంధానించడంలో కీలకంగా మారాయని ఆయన తెలిపారు.

భారత పారిశ్రామిక వ్యవస్థను పునర్నిర్మించిన మారుతి-సుజుకి భాగస్వామ్యాన్ని ఉదాహరణగా ఉటంకిస్తూ... ఇరు దేశాల మధ్య దీర్ఘకాలంగా ఉన్న నమ్మకాన్ని శ్రీ పురీ గుర్తు చేసుకున్నారు. భారత్-జపాన్ ప్రస్తుత ఇంధన రంగంలో ఒకే స్థాయి వద్ద ఉన్నాయని ఆయన అన్నారు. ఇక్కడ వారు ప్రపంచ స్థాయి సామర్థ్యాలను నిర్మించుకోవచ్చు... సంయుక్తంగా సమర్థ సరుకు రవాణా వ్యవస్థను సృష్టించవచ్చు... నైపుణ్యం కలిగిన సిబ్బందిని అభివృద్ధి చేయవచ్చు... ఇండో-పసిఫిక్ ఇంధన భద్రతను సంయుక్తంగా బలోపేతం చేయవచ్చు... అని కేంద్ర మంత్రి వివరించారు.

భారత్‌లో అభివృద్ధి చెందుతున్న ఇంధన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా జపాన్ పరిశ్రమను ఆహ్వానించిన కేంద్ర మంత్రి... అన్ని వాణిజ్య కార్యకలాపాల్లో లోతైన సహకారాన్ని సులభతరం చేయడానికి, సంపూర్ణ మద్దతునందించడానికి భారత ప్రభుత్వం సిద్ధంగా ఉందని భరోసానిస్తూ తన ప్రసంగాన్ని ముగించారు.

## లక్ష్మీపురం మార్కెట్ అధికారులపై చర్యలు తీసుకోవాలి : సోమిడి శ్రీనివాస్



వరంగల్, నవంబర్ 18: వరంగల్ నగరంలోని లక్ష్మీపురం మోడల్ కూరగాయల మార్కెట్‌లో జరుగుతున్న దోపిడీని అరికట్టి రైతుల పంటలకు సరైన ధర వచ్చేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ రైతు సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు సోమిడి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం తెలంగాణ రైతు సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా అదనపు కలెక్టర్‌ను కలిసి మార్కెట్ సమస్యలపై వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన కూరగాయల పంటలను మార్కెట్‌కు తీసుకొస్తే, వ్యాపారులు మార్కెట్ బైలాకు విరుద్ధంగా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

వ్యాపారులే సొంత ఖర్చులకు ఏదో ఒక సందర్భంలో టెండర్ అనే విధానాన్ని వారికే వారే ప్రకటించుకుని, ఆ రోజు రైతులు తెచ్చిన పంటలను తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారని, దీని వలన మార్కెట్‌కు వచ్చే ఆదాయంతో పాటు, రైతులకు వచ్చే ఆదాయాన్ని కూడా కొల్లగొడు తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

2023 లోనే తమ సంఘం ఉన్నత అధికారులకు తెలియజేయగా, ఈ టెండర్ విధానాన్ని రద్దు చేయడం జరిగిందనీ. అయినప్పటికీ, ఈ మధ్యకాలంలో మళ్లీ వ్యాపారస్తులు కూరగాయల మార్కెట్‌లో టెండర్ అనే విధంగా వారికి వారే ప్రకటించుకుని, రైతులకు తక్కువ ధర చెల్లిస్తూ వినియోగదారులకు ఎక్కువ ధరకు అమ్ముతున్నారని అదనపు కలెక్టర్ కు వివరించారు.

నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న మార్కెట్ అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. టెండర్ విధానాన్ని పాటించిన వ్యాపారుల లైసెన్సులను రద్దు రద్దుచేసి టెండర్‌లో వచ్చిన లక్షల రూపాయలను మార్కెట్ కార్యాలయానికి జమ చేయాలన్నారు. మార్కెట్‌లో రైతుల పంటను స్వేచ్ఛగా అమ్ముకునే అవకాశాలు రైతులకు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ జిల్లా ఉపాధ్యక్షులు ఊరటి హంసల్ రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు బల్లు ఎల్లయ్య, రవీందర్ రాజు పాల్గొన్నారు.

## పత్తి కొనుగోళ్లపై ప్రభుత్వాల నిర్లక్ష్యం.. మార్కెట్ యార్డుల్లో రైతుల పడిగాపులు: కేటీఆర్

హైదరాబాద్, నవంబర్ 18:పత్తి కొనుగోళ్లపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరుగాలం కష్టించి పత్తిని పండించిన తెలంగాణ రైతన్నలు, నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల మార్కెట్ యార్డుల్లో పడిగాపులు పడుతున్నారని చెప్పారు. కళ్ల ముందే పండించిన పత్తి ఈ చలికాలపు తేమకు పాడవుతోంటే ఆదుకోవాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలేమో మొద్దు నిద్ర నటిస్తున్నాయని మండిపడ్డారు. నెల రోజుల్లో 28 లక్షల టన్నుల కొనుగోలు లక్ష్యం కాగా కేవలం 1.12 లక్షల టన్నుల పత్తి కొనుగోలు చేశారంటేనే రాష్ట్రంలో నెలకొన్న పత్తి కొనుగోళ్ళ సంక్షోభానికి అద్దం పడుతోందని ధ్వజమెత్తారు.తేమశాతం, కపాస్ మొబైల్ యాప్ రిజిస్ట్రేషన్, మిల్లుల గ్రేడింగ్ అంటూ కుంటి సాకులతో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా పత్తి కొనుగోలు నిరాకరిస్తుంటే, దానికి జిన్నింగ్ మిల్లుల అవినీతి తోడై రైతన్న నడ్డి విరుస్తున్నాయని చెప్పారు. మద్దతు ధర దొరకక, మధ్య దళారులకు తెగనమ్ముకుని రైతులు నష్టాల పాలవుతున్నారని తెలిపారు. రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర మంత్రులు, కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు వెంటనే పత్తి కొనుగోలుకు కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు.

